ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

మంగళవారం 6 ఆగస్టు 2024

ఇంటి పట్టాల స్కాం
గుట్టు రట్టు

● 250 మంది లబ్ధిదారుల ఆశలు గల్లంతు
● సర్వే నెంబరు-59 పట్టాలపై నీలినీడలు
● లేఅవుట్ వేయకుండానే పట్టాల పంపిణీ
● తలలు పట్టుకుంటున్న దళారులు
● పొసెషన్ సర్టిఫికెట్లు దాదాపుగా బోగస్ అంటున్న కమిటీ
● రూ.లక్షల స్కాంలో బాధితులు వందల్లోనే..

అక్కడ అసలు లేఅవుటే లేదు. కానీ అధికారులు మాత్రం అక్కడ లేఅవుట్ ఉన్నట్లు లబ్ధిదారులకు ఇంటిపట్టాలు ఇచ్చేశారు. ఇది గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు, అధికారులు చేసిన జిమ్మిక్కు. బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని బీరంగి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్-59లో 33.06 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వవచ్చని అధికారులు ఎంపిక చేశారు. సర్వేయర్లతో స్కెచ్ వేయించి 477 మందికి ప్లాట్లను కేటాయించవచ్చని నిర్ణయించారు. కానీ లేవుట్‌లో రోడ్లు లేవు.. ప్లాట్లు విభజించలేదు. కానీ వైసీపీ నాయకులు చెప్పిన వారికి మాత్రం పట్టాలు ఇచ్చేశారు. ఇందులో లక్షలాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.



తహసీల్దార్ కార్యాలయంలో గుట్టలుగా ఉన్న పట్టాలు



బి.కొత్తకోట పట్టణ శివారులో పేదల పట్టాల కోసం ఎంపిక చేసిన స్థలం

బి.కొత్తకోట, ఆగస్టు 5: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ఎన్నికలకు ముందు పంపిణీ చేసిన ఇంటిపట్టాలలో జరిగిన భారీ స్కాం బయటపడుతోంది. పదవీకాలం చివరలో ఉన్న తహసీల్దార్ అత్యాశ, తాము అధికారంలో ఉన్నాం కాబట్టి చెయ్యాల్సిందే అన్న వైసీపీ నాయకుల హుకుం, మీకు ఎంతకావాలో చెప్పండి ఇచ్చేస్తాం.. నేను చెప్పేవాళ్లకు పట్టాలివ్వండి అనే దళారులు.. వెరసి ఇంటి పట్టాల లబ్ధిదారుల ఎంపికలో రూ.లక్షలు చేతులు మారినట్లు బయటపడుతోంది. అసలు ఆ పంచాయతీకే చెందని, ఇక్కడ కాపురాలే లేని వ్యక్తులను ఉన్నట్లు చూపి పొసెషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసినట్లు ప్రత్యేక కమిటీ విచారణలో బహిర్గతం కావడం చర్చనీయాంశమైంది. చేతిలో పొసెషన్ ఉన్నా ఆన్‌లైన్‌లో లేక కొందరు, ఇంట్లో జగనన్న పట్టా ఉన్నా పొసెషన్‌లోకి అడుగుపెట్టలేక మరికొందరు లబోదిబోమంటున్నారు.

సర్వేనెంబర్ 59 కథా కమామిషు..

బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని బీరంగి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్-59లో 33.06 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వవచ్చని అధికారులు ఎంపిక చేశారు. సర్వేయర్లతో స్కెచ్ వేయించి 477 మందికి ప్లాట్లను కేటాయించవచ్చని నిర్ణయించారు. బెంగళూరు రోడ్డుకు సమీపంలో ఉండడంతో అందరి కన్నూ ఈ లేఅవుట్‌పై పడింది. ఇందులో ప్లాటు దక్కించుకోవడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. వైసీపీ నాయకులు, దళారులు ఒక్కో ప్లాటుకు రూ.50 వేల వరకు వసూలు చేసుకుని కొందరు అధికారులతో కుమ్మక్కై పేర్లు చేర్పించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొందరికి నేరుగా జగనన్న పట్టాలు మంజూరయ్యాయి. మరికొందరికి వారు ఆ ప్రదేశంలో నివసిస్తున్నట్లు పొసెషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఒకరు ఇద్దరు కాదు ఏకంగా 256 మందికి సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా ఇచ్చేశారు. అంతా అక్రమమని తెలుసుకున్న అప్పటి తహసీల్దార్ 140 మంది పట్టాలను తహసీల్దార్ రద్దు చేశారు. మిగిలిన పట్టాదారులు లేఅవుట్‌లో మిగతా ప్రక్రియ పూర్తి చేస్తే ఇళ్ల నిర్మాణాలు చేపడదామని ఎదురుచూస్తున్నారు. వీరి ఆశలు ఆవిరి అయినట్టేనని ఈ లేఅవుట్‌లో పట్టాలు గల్లంతేనని తెలుస్తోంది.

పట్టాలు.. పొసెషన్ సర్టిఫికెట్లపై విచారణ

సర్వే నెంబరు-59లో తహసీల్దార్ రద్దు చేసిన పట్టాలు పోను మిగిలిన 116 సర్టిఫికెట్లపై విచారణకు ఆరుగురు వీఆర్వోలతో కూడిన ఓ కమిటీని వేశారు. లబ్ధిదారుల అర్హతపై విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఈ కమిటీకి ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. రెండు రోజులుగా ఈ కమిటీ లబ్ధిదారుల ఆచూకీపై విచారణ చేయగా వీరిలో ఒక్కరు కూడా బీరంగి పంచాయతీలో కాపురాలు లేరని, వీరు ఆ పంచాయతీకి చెందినవారు కానందున పొసెషన్ సర్టిఫికెట్లకు అనర్హులని కమిటీ తేల్చింది. దీంతో ఆన్‌లైన్‌లో ఉన్న సర్టిఫికెట్లు సైతం చెల్లుబాటయ్యే పరిస్థితి లేదు ఏదో విధంగా పట్టా పొందాలని ప్రయత్నించి జగనన్న పట్టానో, పొసెషన్ సర్టిఫికెట్‌నో పొందిన 250 మంది లబ్ధిదారుల ఆశలు గల్లంతు అయినట్టు తెలుస్తోంది. దీంతో వీరు డబ్బు చెల్లించిన దళారుల వద్దకెళ్లి మా డబ్బు వాపసు ఇస్తారా? ప్లాటు చూపిస్తారా అంటూ నిలదీస్తున్నట్లు తెలుస్తోంది. లేఅవుట్ ఓపెన్ అవ్వగానే మీ ప్లాటు మీకు వస్తుందని వారు చెబుతున్నా బాధితులు వినడం లేదు. దీంతో దళారులు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం.

తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న పట్టాలు

ఎన్నికలకు ముందు బి.కొత్తకోటలో పనిచేసిన తహసీల్దార్ రఫీక్ అహ్మద్ అనర్హులకు పట్టాలు, పొసెషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని రెవెన్యూ అధికారులే పేర్కొంటున్నారు. బి.కొత్తకోటలోని రెండు మీ-సేవా కేంద్రాల ద్వారా దళారులు పొసెషన్‌లకు దరఖాస్తు చేయించి, వీఆర్వో, ఆర్ఐ సంతకాలు స్టేట్‌మెంట్లు ఏమీ లేకుండా నేరుగా తహసీల్దార్ లాగిన్‌లో అప్రూవల్ చేశారని చెబుతున్నారు. అప్పుడు ప్రలోభాలకు ఆన్‌లైన్ చేసి తర్వాత నాలుక కరుచుకొని వాటిని రద్దు చేసినట్లు తెలుస్తోంది. మధ్యలో డబ్బు చెల్లించిన అమాయకులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న పట్టాలు మూలుగుతున్నాయి.

ఆ సర్వే నెంబర్‌లో భూమి మాదే..

ప్రభుత్వ భూమి అంటూ 477 ప్లాట్లతో సర్వేనెంబరు 59లో వేసిన లేఅవుట్ చెల్లదని, దానిని రద్దు చెయ్యాల్సిందేనని తెలియడంతో లబ్ధిదారులు, దళారులు అయోమయంలో పడ్డారు. ఇందులో పూర్వమే 8 మంది రైతులకు పట్టాలు ఇచ్చారని, వారు ఇందులో క్రయ విక్రయాలు కూడా చేశారని, ఇందులో లేఅవుట్ వేయడమే తప్పని విచారణలో తేలింది. అసలైన హక్కుదారులు బయటకు రావడంతో అలజడి మొదలైంది. మున్ముందు ఈ లేఅవుట్ విషయంలో ఎన్ని గొడవలు, ఫిర్యాదులు వస్తాయోనని రెవెన్యూ అధికారులు, దళారులు బెంబేలెత్తిపోతున్నారు.

నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాం..

సర్వే నెంబరు-59లో వేసిన లేఅవుట్‌లో ఇచ్చిన పొసెషన్ సర్టిఫికెట్లపై ఆరుగురు వీఆర్‌వోలతో కూడిన బృందం విచారణ చేస్తోంది. 100 మందికి పైగా ఇచ్చిన పొసెషన్ సర్టిఫికెట్లకు అప్పటి తహసీల్దార్ సంతకం తొలగించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఉన్న 116లో పొసెషన్ సర్టిఫికెట్లు ఉన్న లబ్ధిదారుల్లో చాలామంది అనర్హులని తెలుస్తోంది. విచారణ పూర్తయిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాము.

- మహ్మద్ అన్సారి, డిప్యూటీ తహసీల్దార్, బి.కొత్తకోట

రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావాలి

● కలెక్టర్లకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్.

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 5: రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కలెక్టర్లు అందరూ ఎక్కువగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలి పారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముఖ్యమంత్రి చంద్రాబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయం, ఉద్యానవనం, పరిశ్రమలు, పశుసంవర్ధకం, అటవీ, మైనింగ్ నీటివనరులు, చేనేత, ఆర్‌అండ్‌బీ, విద్య, ఉపాధి, ఆరోగ్యం, మున్సిపల్‌శాఖ, పంచాయితీరాజ్, గృహనిర్మాణం, పర్యాటకం, సమాచారశాఖ, రెవెన్యూ, ఎక్సైజ్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. వెలగపూడి సచివాలయంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాల్గొనగా జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంక్షేమాన్ని కలెక్టర్లందరూ ఒక్క అవకాశంగా తీసుకుని ప్రభుత్వ విధానాల ద్వారా రాష్ట్ర, జిల్లాల ఆదాయాన్ని పెంచాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ, హౌసింగ్‌ల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా జేసీ జిల్లా అధికారులతో మాట్లాడుతూ సీఎం చేసిన దిశానిర్దేశం మేరకు జిల్లా అధికారులందరూ కార్యాచరణ రూపొందించుకుని లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై

ఫోర్జరీ కేసు నమోదు..?

మదనపల్లె టౌన్, ఆగస్టు 5: మదనపల్లె ఆర్డీవో కా ర్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన గౌతమ్‌తేజపై ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో పోలీసులు అనుమానిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ కొన్ని ఫైళ్లలో గతంలో పనిచేసిన ఆర్డీవో మురళి, హరిప్రసాద్ సంతకాలను ఫోర్జరీ చేసి 22-ఏ ఫైళ్లను నడిపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసుల విచారణలో ఆర్డీవోలుగా పనిచేసిన మురళి, హరిప్రసాద్ తమ సంతకాలను గౌతమ్‌తేజ ఫోర్జరీ చేసినట్లు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఈ క్రమంలో గౌతమ్ తేజపై ఇదివరకే ఒక కేసు నమోదు కాగా, రెండోది ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు తెలిసింది. దీనిని వన్‌టౌన్ పోలీసులు ధ్రువీకరించలేదు. మొత్తం మీద మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైళ్లు రాకపోయినా మదనపల్లె మండలం కోళ్లబైలు గ్రామ పంచాయతీ నుంచి మూడు 22-ఏ ఫైళ్లపై కొందరు ఫోర్జరీ సంతకాలు చేసి ఆర్డీవో కార్యాలయానికి పంపినట్లు తెలిసింది. పదిరోజుల క్రితం రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా నిర్వహించిన తహసీల్దార్ల సమావేశంలో ఓ తహసీల్దార్ తాను కోళ్లబైలు ఫైలుపైన సంతకాలు చేయలేదని స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే మరో తహసీల్దార్ కూడా కోళ్లబైలు పంచాయతీ పరిధిలో 22-ఏ ఫైలుపైన సంతకాలు చేయకున్నా, కొందరు ఫోర్జరీ సంతకాలు చేసినట్లు తెలిసింది. మొత్తం మీద ఇప్పటి వరకు నమోదైన ఎనిమిది కేసుల్లో ఫోర్జరీ సంతకాల కేసుల్లోనే వన్‌టౌన్, టూటౌన్, తాలూకా స్టేషన్‌లలో కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది.

తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ..?

● *విచారణ కోసం పోలీసుల యత్నాలు..!*

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో ఇప్పటికే నలుగురిపై ఫోర్జరీ సెక్షన్ల కింద కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు మదనపల్లె మండల తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ అయ్యాయనే కోణం లో విచారణ ప్రారంభించారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... మదనపల్లె మం డలంలో పలు నిషేధిత జాబితాలో ఉన్న 22-ఏ భూములకు సంబంధించి కొత్త జీవో ప్రకారం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని భూయజమానులు తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. నిబంధనల ప్ర కారం వీఆర్‌వో క్షేత్రస్థాయిలో విచారించి ఆర్ఐ పర్యవేక్షణలో, డిప్యూటీ తహసీల్దార్ ఫైలును ప రిశీలించి సైడు ఇనిషియల్ వేశాక తహసీల్దార్ కు పంపుతారు. తహసీల్దార్ స్వయంగా ఆ భూ ములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైనవి గా తేల్చి సంతకాలు చేసి ఫైళ్లను ఆర్డీవోకు నివేదిక పంపుతారు. కానీ మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం నుంచి నిబంధనలు పాటించని కొన్ని ఫైళ్లు తహసీల్దార్లకు సంబంధం లేకుండా నేరుగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. అంతేకాకుండా మూడు ఫైళ్లలో తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేశారనే అనుమానా లు వచ్చాయి. ఈ క్రమంలో ఇటీవల పోలీసు లు నమోదు చేసిన కేసుల్లో కూడా ఫోర్జరీ సెక్ష న్లు నమోదు కావడం గమనార్హం. దీనిపై విచారించాల్సిందిగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక వన్‌టౌన్ పోలీసులు ఇక్కడ ప నిచేసిన తహసీల్దార్లను విచారించేందుకు చర్యలు చేపట్టారని సమాచారం. కాగా ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లు బదిలీపై వెళ్లగా వారు పనిచేస్తున్న చోటకే వెళ్లి తహసీల్దార్ల నుంచి సంతకాలు వారివా.. కాదా..? అనే కోణంలో స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నట్లు తెలిసింది.

రూ.3 కోట్ల గోల్‌మాల్!

● కార్యదర్శులు, సర్పంచ్‌లకు సంజాయిషీ నోటీసులు!?
● డీఎల్‌పీవో నివేదిక ఆధారంగా నోటీసులు జారీ

పీలేరు, ఆగస్టు 5: పీలేరు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి సంబంధించి వివరణ ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులు పీలేరు గ్రామ పంచాయతీ పూర్వ కార్యదర్శులు, సర్పంచులకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారం పీలేరులో చర్చనీయాంశమైంది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ఏడాది జూన్ వరకు జరిపిన విచారణలో సుమారు రూ.3 కోట్ల మేర అవినీతి బయటపడినట్లు తెలుస్తోంది. పీలేరు గ్రామ పంచాయతీలో పెద్దఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగినట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన నిధుల వ్యయంపై విచారణ చేయాలని ఆయన కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఆయన విజ్ఞప్తి మేరకు మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ బృందాన్ని ఉన్నతాధికారులు నియమించారు. ఆ బృందం గత నెల 5వ తేదీ పీలేరు పంచాయతీలోని అన్ని రికార్డులను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించింది. సుమారు 22 రోజుల పాటు రికార్డుల పరిశీలన జరిపి తమ విచారణ సారాంశాన్ని నివేదిక రూపంలో కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఈనెల 1వ తేదీ అందజేసినట్లు తెలిసింది. ప్రస్తుత పాలకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి సుమారు రూ.3 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు విచారణ బృందం నిర్ధారించినట్లు సమాచారం.



పీలేరు పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఈ కష్టాలు భరించలేకున్నా..!

● నన్ను ఇండియాకు రప్పించండి సార్...
● సౌదీ అరేబియాలో నిమ్మనపల్లి మహిళ కష్టాలు
● తనను కాపాడాలంటూ వేడుకోలు



హసీనా

నిమ్మనపల్లి, ఆగస్టు 5: అప్పుల బాధ నుంచి గట్టెక్కాలని డబ్బు సంపాదన కోసం సౌదీఅరేబియాకు వచ్చాను. ఇక్కడ సేఠ్‌లు నాకు నరకాన్ని చూపిస్తున్నారు.. నన్ను ఇక్కడి నుంచి ఇండియాకు రప్పించండి సార్.. అంటూ ఓ మహిళ తన భర్త, ఆమె తండ్రికి పంపిన వీడియో వైరల్‌గా మారింది. వివరాలిలా ఉన్నాయి. నిమ్మనపల్లి మండలంలోని తురకపల్లికి చెందిన హసీనా (25)కు స్వగ్రామంలోనే హసన్‌అలీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే కుటుంబ బాధలతో ఆమె సౌదీ అరేబియాలో ఇంటిలో పనిచేసేందుకు నెలరోజుల క్రితం వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. హసీనా పంపన వీడియోలో తనను ఇంటి యజమానులు వేధిస్తున్నారని, రాత్రి పగలు అనే తేడా లేకుండా పనిచేయాల్సి వస్తోందని, రేకుల షెడ్డులో పడుకోవాల్సి వస్తోందని అందులో వేడికి తట్టుకోలేకపోతున్నానని చాలా నరకంగా ఉందని రోదిస్తూ తెలిపింది. మీకు దండం పెడతాను సార్.. ఇక్కడే ఉంటే నేను చనిపోతానని, నన్ను ఎలాగైనా ఇండియాకు రప్పించండి సార్... నా ఇద్దరు కుమారులను చూడాలని వుంది అంటూ వేడుకుంది. ఏదో నాలుగు రూపాయలు సంపాదించాలని సౌదీకి వచ్చానని, తీరా ఇక్కడికి వచ్చాక కష్టాలు తెలిశాయని తనను కాపాడాలని కోరింది. ప్రభుత్వం స్పందించి హసీనాను కాపాడాలని ఆమె తండ్రి మస్తాన్ కోరుతున్నాడు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్
● గ్రీవెన్స్‌లో పెద్దిరెడ్డి, మాధవరెడ్డి బాధితులే అధికం

మదనపల్లె టౌన్, ఆగస్టు 5: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు పెద్దపీట వేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 148 మంది ప్రజలు వివిధ మండలాల నుంచి వచ్చి సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌కు వచ్చిన అర్జీలలో... మదనపల్లె మండలం పొన్నటిపాళెం పంచాయతీ ఎగువకురవంకకు చెందిన పి.లక్ష్మీదేవి మాట్లాడుతూ తన సొంత ఇంటిని పెద్దిరెడ్డి అనుచరుడు వి.మాధవరెడ్డి కుమారుడు మౌనిష్‌రెడ్డి, రఘునాథరెడ్డిలు రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. ఈ ఇంటిపై కెనరా బ్యాంకులో రుణం కూడా తీసుకున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా లక్ష్మీదేవికి రెడ్డీస్ కాలనీలో ఇంటి స్థలాన్ని రిజిస్టర్ చేయించి ఇచ్చారన్నారు. తీరా చూస్తే ఆ స్థలం మాధవరెడ్డి భార్య సుధారాణి పేరు మీద లేదని తెలిసిందని వాపోయింది. అయితే కెనరా బ్యాంకు సిబ్బంది లక్ష్మీదేవి ఇంటికి వచ్చి రుణం కంతులు కట్టాలని చెబుతుండటంతో తాను మోసపోయానని తెలిసి సబ్‌కలెక్టర్‌కు తన గోడు వెళ్లబోసుకుంది. వాల్మీకిపురం మండలం పత్తేపురం గ్రామంలో కృష్ణప్పకు 6.66 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో వైసీపీ నాయకులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి పేరు చెప్పి దౌర్జన్యం చేసి 1.30 ఎకరాల భూమిని అక్రమించుకున్నారని కృష్ణప్ప కుమారుడు శ్రీనివాసులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన శింగన్నగారిపల్లెకు చెందిన వై.కృష్ణప్పకు ఎలాంటి నష్టపరిహారం రాలేదని, తన ఇల్లు, భూమి ఆన్‌లైన్‌లో రాలేదని విన్నవించాడు. మదనపల్లె మండలం రంగారెడ్డికాలనీకి చెందిన జి.రెడ్డెప్ప (74) భార్య రెడ్డెమ్మకు గతంలో వృద్ధాప్య పింఛన్ వచ్చేదని, ఆమె మరణానంతరం తనకు పింఛన్ మంజూరు చేయాలని రెండేళ్లుగా తిరుగుతున్నా అధికారులు మంజూరు చేయలేదని విన్నవించాడు.



సబ్ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో మాజీ సైనికులు మాట్లాడుతూ తమకు రెవెన్యూ శాఖ చింతచెట్లకు 2సీ పట్టాలు ఇచ్చారని, ఆ స్థలాన్ని కొందరు అక్రమించుకుని పక్కా భవనాలు నిర్మించారన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు.

బాధ్యతగా ప్రజల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 5: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలని డీఆర్‌వో సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశం హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డీఆర్‌వోతో పాటు ఎస్‌డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. అందిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు నాణ్యతతో బాధ్యతాయుతంగా వంద శాతం పరిష్కరించాలని తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి అవగాహన చేసుకుని వారి సమస్యపై క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.


ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోండి

రాయచోటి ప్రభుత్వ అసుపత్రిలో పనిచేస్తున్న టీబీ వార్డు ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోవాలని హ్యూమన్‌రైట్స్ స్టూడెంట్ సెల్ అధ్యక్షుడు శెట్టిపల్లి సాయికుమార్ సోమవారం డీఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. రాయచోటి ప్రభుత్వ అసుపత్రిలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ టీబీ ఉందా లేదా అని తెలుసుకునేందుకు వచ్చిన వారి దగ్గర నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని డీఆర్‌వోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ రెడీ

● రాజంపేట, రాయచోటిలో ఇప్పటికే సేవలు ● ఈనెల 15న అధికారికంగా ప్రారంభం ● సెప్టెంబరు నాటికి 75 శాతం 4జీ టవర్లు ఏర్పాటు
● ప్రైవేటు సెల్ కంపెనీల చార్జీల పెంపుతో.. ● బీఎస్‌ఎన్‌ఎల్ వైపు చూస్తున్న వినియోగదారులు ● జూలైలో 8 వేల కొత్త కనెక్షన్లు

ప్రభుత్వ రంగ సంస్థ భారత్‌సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 4జీ సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. స్వదేశీ టెక్నాలజీతో 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ నెల 15 నుంచి 4జీ సేవలు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో అందుబాటులోకి రానున్నాయి. ఈమేరకు బీఎస్ఎన్ఎల్ యంత్రాంగం సొంత టవర్లను 4జీగా అప్‌గ్రేడ్ పనులు ముమ్మరంగా చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల్లో 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.





(కడప-ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు బీఎస్‌ఎన్‌ఎల్‌కు సామాన్య జనానికి ఎనలేని బంధం ఉండేది. ల్యాండ్ ఫోను మొదలుకుని 2జీ, 3జీ వరకు బీఎస్‌ఎన్‌ఎల్‌నే వినియోగించేవారు. మారుమూల గ్రామాల్లో సైతం బీఎస్‌ఎన్‌ఎల్ టవర్స్ ఉండేవి. అయితే జియో రాకతో టెలికాం స్వరూపమే మారిపోయింది. 4జీ అంటూ మార్కెట్లోకి వచ్చిన జియో దూసుకెళ్లింది. ఇప్పుడు అది 5జీ సేవలను అందిస్తోంది. ఎయిర్‌టెల్ కూడా 5జీకి సిద్ధమవుతోంది. అయితే ఇంకా బీఎస్‌ఎన్‌ఎల్ 3జీలోనే ఉండేది. గతంలో ప్రభుత్వాలు కూడా బీఎస్‌ఎన్‌ఎల్‌కు చేయూత ఇవ్వకపోవడంతో 4జీని లాంచ్ చేయలేకపోయింది.

మళ్లీ బీఎస్‌ఎన్‌ఎల్ రాక

ఆగస్టు 15న దేశవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 4జీ సేవలను బీఎస్‌ఎన్‌ఎల్ ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు టాటాతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో దేశీయంగా రూపొందించిన టీసీఎస్ టెక్నాలజీతో 4జీ సేవలు అందించనున్నారు. ఈ మేరకు శరవేగంగా టవర్ల అప్‌గ్రేడ్‌తో పాటు నూతన టవర్ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో 290 బీఎస్‌ఎన్‌ఎల్ టవర్లు ఉన్నాయి. ఇప్పటికే రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల్లో 17 టవర్లను 4జీగా అప్‌గ్రేడ్ చేసి అక్కడ సేవలందిస్తోంది. ఇక ఈ నెల చివరి నాటికి 90 టవర్లను 4జీగా అప్‌గ్రేడ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి 44 టవర్ల ద్వారా 4జీసేవలు అందిస్తామని బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు అంటున్నారు. కడప నగరంలో 13, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మైదుకూరు, పోరుమామిళ్ల, వేంపల్లెలో టవర్లను అప్‌గ్రేడ్ చేసి సేవలందిస్తారు. జిల్లాలో అక్టోబరు చివరి నాటికి 75 శాతం టవర్లను అప్‌గ్రేడ్ చేసి 4జీ సేవలు అందిస్తారు. వచ్చే ఏడాది మార్చి నెల చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని టవర్లలో 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయి. అలాగే మెరుగైన సేవల కోసం అదనపు టవర్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ వైపు..

ప్రైవేటు టెలికాం ఆపరేటర్లు గత జూలైలో రీచార్జి ధరలను భారీగా పెంచారు. ఈ సమయంలోనే బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ వైపు అడుగులు వేస్తూ వచ్చింది. దీంతో ప్రైవేటు కంపెనీల నుంచి పోర్టు ద్వారా బీఎస్‌ఎన్‌ఎల్‌కు మారి కొత్త బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్‌లు తీసుకుంటున్నారు. దీంతో జూలైలో కొత్తగా 8వేల పైచిలుకు పోర్టు, ఇతర నెట్‌వర్కుల నుంచి వచ్చిన వాళ్లు, కొత్త కనెక్షన్లు తీసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం బీఎస్‌ఎన్‌ఎల్ పోస్టు, ప్రీపెయిడ్ కలుపుకుని లక్షా 59వేలు ఉన్నాయి.

చౌక ధరలు

ప్రైవేటు కంపెనీలు రీచార్జి ధరలు భారీగా పెంచాయి. అయితే బీఎస్‌ఎన్‌ఎల్‌లో తక్కువ ధరలకే ఆకర్షణీయ ప్లాన్‌లు ఉన్నాయి. ఇతర నెట్‌వర్కుల నుంచి బీఎస్ఎన్ఎల్‌లోకి వచ్చేవారి కోసం రూ.249 ప్లాన్ ఉంది. ఇది 45 రోజుల వ్యాలిడిటీ, అన్‌లిమిటెడ్ కాల్స్ రోజుకు వంద ఎస్‌ఎంఎస్‌లు, 2జీబీ డేటా ఉంటుంది. రూ.149 ప్లాన్‌లో 30 రోజుల వ్యాలిడిటీ, 24 జీబీ, అన్‌లిమిటెడ్ కాల్స్ ఇస్తారు. రూ.1,999 ప్లాన్ ఉంది. ఇది వార్షిక ప్లాన్. అన్‌లిమిటెడ్ కాల్స్, డేటా ఉంటుంది. రూ.666 ప్లాన్. ఇది 105 రోజులవ్యాలిడిటీ ఉంటుంది. రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్. ప్రస్తుతం 2జీ, 3జీ సిమ్‌లు ఉన్న వారు వాటిని 4జీగా అప్‌గ్రేడ్ చేసుకోవాలి. బీఎస్‌ఎన్ఎల్ కార్యాలయంలో ఉచితంగానే 4జీ అప్‌గ్రేడ్ చేస్తారు.

పేదల కోసమా.. కాంట్రాక్టర్ల కోసమా!

- జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు
- ఐదేళ్లలో పది ఇళ్లు కూడా పూర్తి కాని వైనం
- భారీగా బిల్లులు దండుకున్న అధికారులు, కాంట్రాక్టర్లు

మైదుకూరు రూరల్, ఆగస్టు 5: పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అయితే ఇళ్ల నిర్మాణాలు పేదల కోసమా లేక కాంట్రాక్టర్ల కోసమా అనే విధంగా జరిగాయి. కాలనీలో మొత్తం 2,121 ఇళ్లు మంజూరు కాగా.. గత ఐదేళ్లలో పట్టుమని పది ఇళ్లు కూడా పూర్తి కాలేదు. అయితే కాంట్రాక్టర్లు మాత్రం ఇప్పటి వరకు డ్వాక్రా సంఘాల నుంచి కాకుండా.. సుమారు 16.58 కోట్ల రూపాయల బిల్లులు చేసుకొని సొమ్ము చేసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

మైదుకూరు-బద్వేలు రోడ్డులోని గడ్డమాయపల్లె ముక్కొండ సమీపంలో జగనన్న కాలనీలో ఏబీసీడీఈ బ్లాకులుగా విభజించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 2,121 ఇళ్లు మంజూరు కాగా.. ఇంత వరకు గుంతలు కూడా తీయనివి 175, పునాదుల వరకు తీసినవి 653, గోడల వరకు వచ్చినవి 219, స్లాబ్ అయినవి 827, పెయింట్లు అయి పోయి పూర్తి అయినవి 246గా అధికారులు రికార్డులలో ఉన్నాయి. కానీ వాస్తవానికి అక్కడ కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు సమాచారం. ఇక ఇళ్ల నిర్మాణాలు పూర్తికాక మునుపే గోడలు నెర్రలు చీలి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కాలనీలో కనీస సౌకర్యాలు కూడా లేవు. ఏ వీధిలో సిమెంటు రోడ్డు లేదు. నీటి సౌకర్యం కల్పించలేదు. మెయిన్ రోడ్డు నుంచి వచ్చే రెండు వరుసల రహదారి కూడా కంకర పరిచి వదిలేశారు.


జగనన్న కాలనీలో సిమెంటు రోడ్డు లేని దృశ్యం

జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులు మాత్రం అధికారుల, కాంట్రాక్టర్ల ఒత్తిడితో డ్వాక్రా సంఘాల ద్వారా, బయట వడ్డీలకు అప్పులు తెచ్చి ఇచ్చారు. డబ్బులు ఇచ్చాం.. పనులు మాత్రం చేయలేదని కాంట్రాక్టర్‌ను అడిగితే అక్కడ నీళ్లు లేవు, బిల్లులు రాలేదు అంటూ సాకులు చెప్పి తప్పించు కున్నారని వాపోతున్నారు. కొందరైతే డబ్బులు ఇచ్చాం.. మా ఇంటి పనులు మొదలే పెట్టలేదని చెబుతు న్నారు. ఏదిఏమైనా పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాలతో ఆడుకుంటూ ఇటు అధికారులు, అటు కాంట్రాక్టర్లు డబ్బులు మాత్రం దోచుకున్నారని.. ఇళ్ల నిర్మాణాలు మాత్రం పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో జగ నన్న కాలనీపై కలెక్టర్ దృషి సారించి పేదలకు న్యాయం చేయాలని, అక్ర మార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.


జగనన్న కాలనీలో పిచ్చి చెట్ల మధ్య అసంపూర్తిగా ఉన్న ఇళ్లు


ఇళ్లు పూర్తికాక మునుపే నెర్రెలు చీలిన దృశ్యం

డబ్బులు తీసుకొని రెండేళ్లయ్యింది..

మాకు ఈ బ్లాకులో ఇల్లు మంజూరైంది. కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణం చేస్తాము, డబ్బులు ఇవ్వమని అడుగగా.. అప్పు చేసి 15 వేల రూపాయలు 2022 జూన్‌లో అయనకు ఫోన్‌పేలో డబ్బులు వేశాము. కానీ ఇంత వరకు గుంతలు కూడా తీయలేదు. ప్రభుత్వం మారింది, ఇప్పుడు మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

-ఏ.వరలక్ష్మి, జగనన్న ఇంటి లబ్ధిదారు

చర్యలు తీసుకుంటాం...

జగనన్న కాలనీలో అవినీతి జరిగిందని రుజువైతే చర్యలు తప్పవు. నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. కాలనీలో జరిగిన పరిస్థితులపై పూర్తి నివేదికలను కిందిస్థాయి అధికారులతో అడిగి తెలుసుకుంటా.. ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాము.

-గోపాలక్రిష్ణ, హౌసింగ్ డీఈ

జ్ఞాన సంపదతోనే ఆర్థిక సంపద

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి


వెబ్‌నార్‌లో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5: జ్ఞాన సంపదతోనే ఆర్థికసంపద సాధ్యపడుతుందని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం వైవీయూ కామర్స్ శాఖ అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టి అంశంపై జాతీయ వెబ్‌నార్ నిర్వహించారు. వెబ్‌నార్ కన్వీనర్ రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి సమన్వయం వహించగా, వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన విధానాల వల్లనే ఆర్థిక పరిపూర్ణత సాధించగలమన్నారు. వెబ్‌నార్ కన్వీనరు పర్వనాథరెడ్డి మాట్లాడుతూ ధనం మూలం ఇదం జగత్ అన్నట్లు వ్యక్తుల అవసరాలకు ఆర్థిక వనరులు ప్రాథమికమైనవి, ఆర్థిక ప్రణాళిక ద్వారా సంపద సృష్టి జరుగుతుందన్నారు. పెట్టుబడుల్లో పితామహుడైన వారంబఫిట్ జీవితం గురించి వివరించారు. కార్యక్రమంలో కామర్స్‌శాఖ విభాగాధిపతి ప్రొఫెసరు విజయభారతి, సహాయాచార్యులు డాక్టర్ జి.హరినాధ్, పద్మ పాల్గొన్నారు.

పీజీ నాలుగో సెమిస్టరు ఫలితాలు విడుదల

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టరు ఫలితాలను వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేసన్స్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డిలు విడుదల చేశారు. పీజీ కోర్సులైన సైకాలజీ, మైక్రోబయాలజీ, మేథమేటిక్స్, జియాలజీ, ఫుడ్ టెక్నాలజీ, జువాలజీ మైక్రోబయాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బోటనీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎంపీఈడీ సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు లభించాయన్నారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ మమత, డాక్టర్ శ్రీనివాసరావు, వెంకట్రామ్, పాల్గొన్నారు.

బస్సు బైక్ ఢీ... వ్యక్తి మృతి


ఆదినారాయణరెడ్డి మృతదేహం

గాలివీడు, ఆగస్టు 5: ఎదురెదురుగా వస్తున్న బస్సు బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముండ్ల ఆదినారాయణ (50) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మృతుడు తంబళ్లపల్లి మండలం దేవరింటి పల్లె నివాసి కాగా గాలివీడు మండలం ఉయ్యాలవాండ్లపల్లెలో తన కుమార్తెను ఇచ్చి వివాహం చేశాడు. సోమవారం కుమార్తెను, మనుమరాలిని చూసి తిరుగు ప్రయాణంలో గాలివీడులో తన వ్యక్తిగత పనులు చూసుకుని వెళుతుండగా మార్గమధ్యంలో కుమ్రపల్లె కొయ్యమిషన్ వద్ద మదనపల్లె నుంచి వస్తున్న అద్దె బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్రవాహన చోదకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లెకు తరలించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండోలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు


తైక్వాండో పోటీలలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 5 : అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 2,3,4 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి ద్వితీయ చాంపియన్స్‌గా నిలిచారు. ఇందులో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 425 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో కడప జిల్లా నుంచి 41 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఏడుగురు బంగారు పతకాలు, మరో నలుగురు రజిత పతకాలు, మరో ఐదుగురు కాంస్య పతకాలు సాధించారు. మొత్తం 107 పాయింట్స్ సాధించి ద్వితీయ చాంపియన్స్‌గా నిలిచినట్లు జిల్లా తైకాండో అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి మాస్టర్ నాయబ్ రసూల్ వెల్లడించారు. ఇందులో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే సెప్టెంబర్ 9, 10, 11 తేదీలలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాల్సివుందని వారు వెల్లడించారు. ఇదిలా వుండగా జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా ఒలంపిక్ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి రవాణా చార్జీల కింద ఒక్కో క్రీడాకారుడికి రూ.2 వేలు అందించనున్నట్లు స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీ

పుల్లంపేట, ఆగస్టు 5: రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థిని విద్యార్థులు ఎంపికైనట్లు పుల్లంపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి తెలిపారు. ఈనెల 4న రాయచోటిలో జరిగిన జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపికలలో బాలికల విభాగంలో ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థిని మధు, 9వ తరగతి విద్యార్థిని జాస్మిన్, బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు గోపికృష్ణ, రిషిత్‌లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. సెప్టెంబరు 15 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, పీడీ నీలకంఠరావును అభినందించారు.

గంజాయి కేసులో ముగ్గురు వ్యక్తులు అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇబ్రహీం

కడప (క్రైం), ఆగస్టు 5 : కడప నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మార్కెట్‌యార్డు సమీపంలో సీఐ జి.ఇబ్రహీం ఆధ్వర్యంలో సోమవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.30వేలు విలువైన 3.2 కిలోల గంజాయిని, రూ.15110 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో శంకరాపురానికి చెందిన రాజేశ్‌కుమార్, పెద్దబెస్తవీధికి చెందిన చిరుబోయిన సుధీర్, రామాంజనేయపురానికి చెందిన నీలం గిరిశంకర్‌లు ఉన్నారు. వీరిని అరెస్టు చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీఐ అభినందించారు.

రాయలసీమ డయాసిస్ ఆస్తులను పరిరక్షించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 5: అన్యాక్రాంతమవుతున్న రాయలసీమ డయాసిస్ ఆస్తులను పరిరక్షించాలని రాయలసీమ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సీఎస్ఐ రాయలసీమ అధ్యక్ష మండలి సంఘా లు, రాయలసీమ ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యం లో స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ డయాసిస్ చర్చి ఆస్తులను ఇతరులకు దారాదత్తం చేస్తున్న కడప సీఎస్ఐ చర్చి బిషప్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు అవ్వారు మల్లికార్జున, జేవీ రమణ, సంగటి మనోహర్, గ్రేటర్ రాయలసీమ నాయకులు కె.ఆంజనేయులు మాట్లాడారు. లీజు పేరుతో ఎక్కువ (సుమారు 40 సంవత్సరాలు) సంవత్సరాలకు చర్చి స్థలాలను ఇష్టారాజ్యంలా కట్టబెట్టి కోట్లాది రూపాయలు దండుకుని సొమ్ముచేసుకుంటున్నారని ఆరోపించారు. రాయలసీమ వ్యాప్తంగా వున్న అన్ని జిల్లాల్లో గల స్థలాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పనంగా కట్టబెడుతూ లబ్దిపొందుతున్నారని నిప్పులు చెరిగారు. దీనిపై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను కలుస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా అధికారులు స్పందించి డయాసిస్ ఆస్తులు పరుల పాలు కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం పాస్టర్ ఐక్యతరావు, జనతాదళ్ పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, వివిధ ప్రజాసంఘాల నాయకులు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

22 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, ఆగస్టు 5: ఒక వాహనంతో సహా 22 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకు ఎర్రచందరం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారం మేరకు తాము ఆదివారం రాత్రి 9 గంటల నుంచి కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. సోమవారం ఉదయం 2.30 గంటల ప్రాంతంలో పీలేరువైపు వస్తున్న నెంబరు లేని టయోటా ఇతియోస్ కారు తాము ఆపినా ఆగకుండా వేగంగా వెళ్లిపోయిందన్నారు. తాము ఆ వాహనాన్ని వెంబడించగా బెంగళూరు-తిరుపతి రహదారిలోని చెర్లోపల్లె వద్ద కారును ఆపివేసి, డ్రైవర్, మరో వ్యక్తి చీకటిలో పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా అందులో 349 కేజీలు బరువున్న 22 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం కూడా గాలింపు ముమ్మరం చేశామన్నారు.

రెడీమేడ్ షోరూం యజమానిపై దాడి

కడప (క్రైం), ఆగస్టు 5 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉడిపి హోటల్ ఎదురుగా ఉన్న వికాస్ రెడీమేడ్ షోరూం యజమాని వికాస్‌కుమార్‌పై అక్కడ పనిచేస్తున్న బాలాజీ అనే యువకుడిని సరిగా పనిలోకి రాకపోతే మానెయ్యాలని చెప్పాడు. దీంతో బాలాజీ తన స్నేహితులైన శ్రీధర్, ఉపేంద్రలతో కలిసి వచ్చి దాడి చేయడంతో వికాస్ గాయపడ్డాడు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కలికిరి, ఆగస్టు 5: కలికిరి క్రాస్ రోడ్డులో గత శుక్రవారం తీవ్ర అనా రోగ్యానికి గురయిన గుర్తు తెలియని వ్యక్తిని స్థానిక పోలీసులు అంబులెన్స్ సాయంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను సోమవారం వేకువ జామున మృతి చెందినట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యక్తిని గుర్తించిన వారు కలికిరి పోలీసు స్టేషనుకు సమాచారం అందజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి

రామసముద్రం, ఆగస్టు 5: తమిళనాడులోని రాణీపేట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి చెందాడు. రామసముద్రం మండలం భూసానికురప్పల్లెకు చెందిన రైతు కె.రామచంద్ర (50) ఆదివారం సాయంత్రం క్యాలీ ఫ్లవర్‌ను ఐషర్ వాహనంలో చెన్నై మార్కెట్టుకు తీసుకెళ్తుండగా రాణీపేట వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వాహనం బోల్తా పడింది. దీంతో రామచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు.

అనర్హులకే అందలం

- సభ్యత్వం లేని వారికి, ప్లాట్లు లేని వారికి ఓటు హక్కు
- హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలలో నిబంధనల ఉల్లంఘన
- డబ్బులు కట్టిన తమకు ప్లాట్ ఇవ్వలేదంటున్న బాధితులు
- నిజాలు వెలికి తీసేందుకు ప్రయత్నిస్తే బెదిరింపులు

పులివెందుల రూరల్, ఆగస్టు 5: పులివెందుల ప్రభుత్వ ఉద్యోగుల కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో అనర్హులకే అధికప్రాధాన్యత ఇస్తున్నారు. సభ్యత్వం లేని వారికి, ప్లాట్లు లేని వారికి ఓటు హక్కు కల్పించారు. ఎన్నికలలో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ ప్రశ్నించినవారికి జిల్లాస్థాయి అధికారులతో సంబంధాలు ఉన్న ఓ వ్యక్తి సంబంధిత శాఖ అధికారుల నుంచి ఒత్తిడి తెచ్చి ఆ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారు. సభ్యుల సంఖ్య ఎంత, వాస్తవ సభ్యులు ఎవరు, ఓటర్లు ఎవరు, ప్లాట్లు ఎన్ని, ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించిన అధికారులు, అడ్డుపడకుండా ఎలాంటి బెదిరింపులకు దిగారు లాంటి వాటిని వెలికితీయాలంటే సమగ్ర విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు. సొసైటీ బైలా ప్రకారం నడుచుకోలేదని పలువురు చెబుతున్నారు.

నిబంధనలు ఇలా...

పులివెందుల తాలూకాలో పనిచేసే వారు మెంబర్ షిప్ తీసుకోవాల్సి ఉంటుంది. మెంబర్‌షిప్ తీసుకున్న వారితో పాటు కుటుంబ సభ్యుల పేరుతో ప్లాట్, బిల్డింగ్ లాంటివి ఉండకూడదు. ఉద్యోగి ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తి అయి ఉండకూడదు. మరొక సొసైటీలో పేరు ఉండకూడదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండకూడదు. భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండకూడదు, నోటిఫికేషన్ ఇవ్వాలి, అందరికీ తెలియజేయాలనే తదితర నిబంధనలు ఉన్నాయి. కానీ 2023లో పులివెందుల హౌస్ బిల్డింగ్ సొసైటీలో ఇవేమీ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పోటీ దారులు ఉన్నప్పటికీ వారిని ఎలాగోలా తప్పించి ఎన్నికను ఏకగ్రీవం చేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అప్పట్లో ఎన్నికలో తలదూర్చిన వారిని ఎన్జీఓ నేత తన అధికార పలుకుబడితో బెదిరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఎన్నికలు జరపాలని కలెక్టర్ ఉత్తర్వు ఇస్తే.. పబ్లికేషన్ చేయలేదని చెబుతున్నారు. సొసైటీ ఎన్నికలు నిర్వహంచే అధికారి నోటిఫికేషన్ ఇవ్వలేదని చెబుతున్నారు. ఎన్జీఓ నేత, ఎన్నికల అధికారి కలిసి పోటీ చేయకూడదని ఫోన్లు చేయడం, నామినేషన్లు వేయకూడదని చెప్పడం, వినకపోతే ఆయా శాఖలకు సబంధించిన ఉన్నతాధికారులతో ఫోన్లు చేయించడం ఇలా పలు రకాలుగా బెదిరింపులకు దిగారని పలువురు చెబుతున్నారు.

ఇష్టానుసారం ప్లాట్ల కేటాయింపు

పులివెందుల పట్టణంలోని కదిరిరోడ్డులో ఉన్న ఎన్జీఓ కాలనీలో ప్లాట్లకేటాయింపులో అక్రమాలు జరిగాయని చెబుతున్నారు. సభ్యత్వం తీసుకున్నప్పటికి సీనియారిటీ ప్రకారం కాకుండా తమకు అనుకూలమైన వారికి, తమ కుటుంబసభ్యులకు ప్లాట్లు పంచుకున్నారని విశ్వసనీయ సమాచారం. 2010 సమయంలో గతంలో రూ.75వేలు, రూ.1.50లక్షలు, రూ.5లక్షలు వెచ్చించి మూడు ఎకరాలు కొనుగోలు చేశారు. వీటిలో చాలా వరకు ఎన్జీఓ నేతలుగా చెలామణి అవుతున్న కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించి ప్లాట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు వచ్చాయి. అనంతరం 2023లో హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సభ్యత్వం తీసుకున్న వారికి కాకుండా తమ సొంత మనుషులు, కుటుంబ సభ్యుల పేర్లతో స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిసింది. అప్పట్లో లక్ష రూపాయలతో కొనుగోలు చేసిన ఎకరా స్థలం, 2019 తర్వాత ఒక ప్లాటే దాదాపు రూ.5లక్షలు పలికింది. అందులోను కదిరికి వెళ్లే మెయిన్ రోడ్డు పక్కనే ఉండడంతో ప్లాట్లకు విపరీతమైన డిమాండ్ ఉండేది. దీంతో కోట్ల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సొసైటీలో ఉన్న కొందిరికి మాత్రమే ప్లాట్లు ఉన్నాయని, కొందరికి మొండిచేయి చూపి బ్యాంకుల్లో లోన్లు ఇప్పించారని తెలిసింది. ఈ విషయంపై పులివెందుల ఎన్జీఓ సంఘంలోని ప్రధాన నేతను ప్రశ్నిస్తే.. తమ సంఘానికి డబ్బు అవసరమైనప్పుడు ప్లాట్లు అమ్ముకుంటామని, తమ ఇష్టమని సమాధానమిచ్చారు.

ప్రస్తుత ప్రెసిడెంట్ కుటుంబ సభ్యుల పేరుతో ఇళ్లు

పులివెందుల హౌస్ బిల్డింగ్ సొసైటీకి ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న గురుప్రసాద్ కుటుంబ సభ్యులకే ప్లాట్లు ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. దీనిపై విచారణ చేస్తే కొంచెం ఎన్జీఓ ప్లాట్, మరికొంత ఇతర పట్టా భూమికి చెందిన స్థలంలో ఇంటి నిర్మాణం సాగుతున్నట్లు స్పష్టమైంది. దీంతో సొసైటి ఏ మేర అక్రమాలకు పాల్పడ్డారనే విషయం వెల్లడవుతోంది. ఈ విషయంపై పలువురు ఉద్యోగులు కేసు కూడా వేసినట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణచేస్తే అక్రమాలు బయటకు వస్తాయని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.



డబ్బులు చెల్లించినా.. ప్లాట్ కేటాయించలేదు

తాను పులివెందుల తాలూకా సింహాద్రిపురం మండలంలోని కోవరంగుట్టపల్లె పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న సమయంలో సభ్య త్వం పొందాను. ఎంపీహెచ్ఎస్‌గా విధులు నిర్వహిస్తూ 2002లో ప్లాట్ కోసం రూ.1300, 2004లో రూ.3000 డబ్బులు చెల్లించి రసీదు పొందాను. అయినప్పటికీ నాకు ప్లాట్ కేటాయించలేదు. సీనియారిటీ ప్రకారం ప్లాట్ కేటాయిస్తామని చెప్పిన సొసైటీ నేతలు దాన్ని పక్కన పెట్టి తమ సొంత వారికి ప్లాట్ తీయించారు. దీనిపై 30.06.2023న డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశాను. ఇందులో కూడా న్యాయం జరగలేదు. ప్రస్తుతం రిటైర్డ్ అయ్యాను.

-ఎం.రోసిలిన్, పులివెందుల.

బైలాలో ఉంది..

భూమి కొన్న సమయంలో అమ్మిన వారు కూడా ప్లాట్లు ఇవ్వాలని కోరారు. అమ్మిన వారికి కూడా ప్లాట్లు ఇవ్వొచ్చని బైలాలో ఉంది. ఆ ప్రకారమే ప్లాట్లు ఇచ్చాం.

-గురుప్రసాద్, కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు, పులివెందుల తాలూకా.

మన్నూరు సీఐగా రామాంజనేయులు



రాజంపేటటౌన్, ఆగస్టు 5: రాజంపేట పట్టణ మన్నూరు సీఐగా రామాంజనేయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రనాథ్ బదిలీ కావడంతో మదనపల్లె లోని పెద్దతిప్పసముద్రం ఎస్ఐగా పనిచేస్తున్న రామాంజనేయులు పదోన్నతిపై మన్నూరు సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐకు సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

13న మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం, ఆగస్టు 5: మండల కేంద్రమైన సిద్దవటం మండల ప్రజా పరిషత్ సభాభవనంలో ఈ నెల 13న మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వర్ రావు తెలియజేశారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

వంగిమళ్ల వాసికి డాక్టరేట్

వీరబల్లి, ఆగస్టు 5: మండలంలోని వంగిమళ్ల గ్రామం నల్ల పర్వతయ్యగారిపల్లెకు చెందిన కీ.శే. టి.మల్‌రెడ్డి కుమారుడు టి.మధుసూదన్‌రెడ్డికి తమిళనాడు విట్ యూనివర్శిటీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. ఈ మేరకు విట్ కెమెస్ట్రీ హెచ్‌వోడీ సర్వేశ్వరి నుంచి పట్టా పుచ్చుకున్నారు. ఈయన విట్‌లో ఎమ్మెస్సీ కెమెస్ట్రీ పూర్తి చేసిన పిరిడైన్ ప్యూజ్డ్ హెటెరో సైకిల్స్ తయారీ, వాటి జీవశాస్త్ర అధ్యయనాలపై ఈ డాక్టరేట్ వచ్చినట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

రాయచోటిటౌన్, ఆగస్టు 5: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో భూరికార్డులు తగలబెట్టిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా భూ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 12న జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో జిల్లా వ్యాప్తంగా అనేక భూ కుంభకోణాలు, పేదల భూములు ఆక్రమణకు గురయ్యారన్నారు. మదనపల్లె నియోజకవర్గంతో పాటు తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గంలో భూకుంభకోణాలు బయటపడతాయనే భూ రికార్డులు తగలబెట్టారని, అలాంటి వారికి సహకరించిన అవినీతి రెవెన్యూ అధికారులపై పోలీసులు కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో భూ రికార్డులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ భూ బాధితుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 12న జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో జరిగే ఆందోళనలో రెవెన్యూ భూ బాధితులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోపు కృష్ణప్ప, సాంబశివ, శ్రీనివాసులు, విశ్వనాధనాయక్, సుధీర్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మణి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

వార్షికోత్సవ కరపత్రాల విడుదల

చిన్నమండెం, ఆగస్టు 5: మండలంలో ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించే జిల్లా స్థాయ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రాలను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క యువతీ, యువకులు విద్యతో పాటు క్రీడల పట్ల, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని, నైపుణ్యాన్ని పెంపొందించుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలను ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఒక రాష్ట్ర క్రీడాశాఖ మంత్రిగా ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించే క్రీడా, సాంస్కృతిక కరపత్రాలను శ్రీచైతన్య విద్యాసంస్థల ఉమ్మడి కడప జిల్లా ఏజీఎం దేరంగుల రమణ విడుదల చేశారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పి.మదన్ మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, ఏరియా అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కార్తీక్ పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు టీడీపీ నేతల వినతి

రాజంపేట, ఆగస్టు 5: రాజంపేట నియోజకవర్గంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవికి టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సబ్‌కలెక్టర్‌ను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా దళితులు భూమిలేక కూలీలుగా మారిపోయారని, వారికి భూములు ఇవ్వాలని కోరారు.

తల్లిపాలు ఔషధం లాంటివి: సీడీపీవో

పెనగలూరు, ఆగస్టు 5: తల్లిపాలకు బిడ్డకు దివ్య ఔషధం లాంటిదని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి అన్నారు. సోమవారం కొండూరు అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త వెంకటలక్ష్మీ అధ్యక్షతన జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామానుజులమ్మ, సూపర్‌వైజర్ విశాలాక్షి, కొండూరు సెక్టార్ పరిధిలోని ఏడు అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట, ఆగస్టు 5: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2024-25 విద్యా సంవత్సరంలో మిగిలిన సీట్ల ప్రవేశానికి ఈ నెల 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వెరిఫికేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైందన్నారు. కౌన్సెలింగ్‌కు ఈ నెల 29న హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

బస్సు సౌకర్యం ఏర్పాటుకు కసరత్తు



బస్సు సౌకర్యం ఏర్పాటుపై ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

సుండుపల్లె, ఆగస్టు 5: పీలేరు డిపో నుంచి సుండుపల్లె మీదుగా రాజంపేటకు బస్సు సౌకర్యం కల్పించేందుకు సోమవారం పీలేరు డిపో మేనేజరు బండ్లకుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ రోడ్డును పరిశీలించారు. రవాణాశాఖ మంత్రి ఆదేశాల మేరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా రెండవసారి రూట్ ట్రయల్ రన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్రామరాజు, రైతు సంఘం సేవా మిత్ర అధ్యక్షుడు సుబ్బరామరాజు, జనసేన నాయకుడు రామాశ్రీనివాస్, నియోజకవర్గ హెచ్‌ఆర్ ఎస్సీ ఉపాధ్యక్షుడు ఆనందరెడ్డి, సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శరత్‌కమల్

నందలూరు, ఆగస్టు 5: గర్భిణీలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్‌కమల్ తెలియజేశారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని పాటూరు గ్రామ సచివాలయ పరిధి ఎస్టీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు, తల్లులకు అంగన్వాడీ టీచర్లకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని, బిడ్డ పుట్టిన వెంటనే అరగంట తర్వాత బిడ్డకు ముర్రుపాలను తాపించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మోహన్‌రెడ్డి, సీహెచ్‌వో వెంకటనారాయణ, అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, సచివాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఈ-పంట నమోదు చేయాలి

● ఏవో నాగమణి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామాపురం, ఆగస్టు 5: పంట సాగు చేసిన రైతులు ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని ఆయా రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జులు, గ్రామాల వీఆర్‌వోలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఖరీఫ్‌సాగుకు సంబంధించి 2024-25 పంట నమోదు కార్యక్రమంపై సోమవారం రైతు సేవా ఇన్‌చార్జిలకు, వీఆర్‌వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జిలు, వీఆర్‌వోల సహకారంతో ఫీల్డ్ లెవెల్‌లో పంట వేసిన ప్రతిఒక్క రైతు పంట వివరాలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని ఆమె అన్నారు. మండలంలో 12 రెవెన్యూ గ్రామాలకు గానూ 9 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, రీసర్వే అయిన గ్రామాల్లో మొదటిగా వీఆర్‌వో జాయింట్ ఎల్‌ఆర్ మెంబర్స్‌ను నమోదును ప్రతి రైతు విస్తీర్ణం ఖాతా వారిగా వారి లాగిన్‌లో అప్డేట్ చేయాల్సిందిగా తెలిపారు. ఈ-పంట యాప్ గురించి రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలకు, వీఆర్‌వోలకు పూర్తిగా అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, ఆర్ఐ రవికుమార్, ఏఈవో కవిత, నాగార్జున, ఏఎస్‌వో రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం: ఏసీడీపీవో



ప్రాముఖ్యతను వివరిస్తున్న ఏసీడీపీవో

సుండుపల్లె, ఆగస్టు 5: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని సుండుపల్లె ప్రాజెక్టు ఏసీడీపీవో సుగుణమ్మ తెలిపారు. సోమవారం మడతాడు సెక్టారులో అంగన్వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపడం ఎంతో శ్రేయస్కరమని, దానివల్ల కలిగే లాభాలను గర్భిణీలు, బాలింతలకు తెలియజేశారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ప్రతివారం ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించే వైద్య శిబిరాలకు హాజరుకావాలని సూచించారు. పుట్టబోయే బిడ్డ క్షేమాన్ని తప్పనిసరిగా ప్రతి నెల స్కానింగ్ ద్వారా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మడితాడు సూపర్‌వైజర్ వనజమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ యల్లమ్మ, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందువుల పవిత్ర మాసం.. శ్రావణమాసం

● అన్నదాన కార్యక్రమంలో సుగవాసి ప్రసాద్‌బాబు



కొత్తపేట శివరామాలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు 5: హిందువుల పవిత్ర పుణ్యమాసం శ్రావణ మాసం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీడీపీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా సోమవారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట శివరామాలయంలో అన్నదాత ఏనుగుల విశ్వనాధ, ధర్మకర్త వీరయ్యల ఆహ్వానం మేరకు ప్రసాద్‌బాబు శివరామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు పురం వీరయ్య, అన్నదాత ఏనుగుల విశ్వనాథ్‌లు ప్రసాద్‌బాబును శాలువా, గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అన్నదానం చాలా గొప్పదని, పవిత్ర శ్రావణమాసంలో దాతలు పేదల సౌకర్యార్థం అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, గోరంట్ల రవి, నాగార్జున, నాగేంద్ర, రవి పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూములను కూలీలకు పంచాలి

● బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.క్రిష్ణప్ప

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 5: గత ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నేత పండుగోల మణి, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.క్రిష్ణప్ప డిమాండ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వేలాది ఎకరాలు బడా వ్యాపారస్తుల చేతుల్లో వెళ్లడానికి అధికారులు సహకరించారని, వారి అండదండలతో కబ్జాదారులు అడ్డూ అదుపు లేకుండా దోచేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా దోచుకోన్న ప్రభుత్వ భూములను వ్యవసాయ కూలీలకు పంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గతంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు 9 వారాలు డబ్బులు రావాల్సి వుందన్నారు. ప్రతి కూలీకి రూ.600 ఇవ్వాలని, అంతేకాకుండా ప్రతి కూలీలకు జాబ్‌కార్డు తప్పని సరిగా ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై కలెక్టరేట్లోని డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌కుమార్, విశ్వనాధనాయక్, గోపాల్, అనసూయ, కిషోర్ పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో బీసీ బాలుర, మహిళల హాస్టల్స్‌లో విద్యార్థులు సరైన భోజనాలు, బాత్‌రూంలు, నిత్యావసరాలపై చాలా ఇబ్బందులు పడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర్ సోమవారం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాస్మెటిక్ చార్జీలను వార్డన్లు తమకు ఇష్టం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో బిల్లులు చేస్తున్నారని వారు ఆరోపించారు.

సబ్‌కలెక్టర్‌కు వినతి

రాజంపేట, ఆగస్టు 5: రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని భూ సమస్యలపై పలువురు సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవికి వినతిపత్రాలు సమర్పించారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె స్పందిస్తూ ఎటువంటి ఆలస్యం లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 5: పుట్టిన ప్రతిబిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమని ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఎంపీడీవో కుళ్లాయిస్వామి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలు ఈ సందర్భంగా మంగంపేట సచివాలయాలో అంగన్వాడీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే అందించబడే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

● సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో, ఎస్ఐలు

సుండుపల్లె, ఆగస్టు 5: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈఓ రవీంద్రనాయక్, ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్‌లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8న మండల వ్యాప్తంగా 87 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, గుణాత్మక విద్య అభివృద్ధికి ఈ ఎన్నికలు ఎంతో దోహదపడతాయని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. సమస్యాత్మక పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ నెల 8న జరిగే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో అమర్‌నాథ్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా డీఎస్సీ కోచింగ్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 5: జిల్లాలో వుండే బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన గిరిజన కులానికి చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు తిరుపతిలో డీఎస్సీ కోచింగ్ ఫ్రీగా ఇస్తున్నారని గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజశ్విని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని బీఈడీ, డీఈడీ, టీఈటీలో ఉత్తీర్ణత కలిగిన నిరుద్యోగులందరు ఉచిత డీఎస్సీకి అర్హులని వారు తెలిపారు. యువతి, యువకులు వారి విద్యా అర్హతతో పాటు కులధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, గెజిటెడ్ సంతకాలు చేసిన ధ్రువపత్రంతో కలిపి 12.8.2024 తేదిన సాయంత్రం 5:00 గంటలలోపు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 8332082016ను సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కోనంపేటలో స్ప్రే చేయిస్తున్న డాక్టర్ సిద్దయ్య

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 5: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోనంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. సోమవారం కోనంపేటలో దోమల నివారణపై ఇళ్లల్లో పైరేత్రం స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా కోనంపేట మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన పెంచుకోవాలని, మరుగుదొడ్లలోని నీరును ఇష్టానుసారంగా రోడ్లమీదకు వదలొద్దన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమలు నివారించుటకు దోమతెరలు ఉపయోగించాలని, వర్షాకాలంలో నీరును కాచి తాగాలని ప్రజలకు సూచించారు. కోనంపేట పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో అన్ని ఇళ్లల్లో పైరేత్రం స్ప్రే చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీంద్ర, సర్పంచు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయచంద్ర సూపర్‌వైజర్ రామ్, సరస్వతి, ఏఎన్ఎంలు హేమలత, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో తెరుచుకున్న గండిచెరువు తూములు



పూడ్చిన కాలువలను ఎక్సకవేటర్‌తో పునరుద్ధరిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 5: గత వైసీపీ ప్రభుత్వంలో మూతపడ్డ కంచాలమ్మ గండిచెరువు తూములు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో ఎట్టకేలకు తెరుచుకున్నాయి. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ అబ్బవరం గ్రామంలో గల కంచాలమ్మ గండి కాలువ తూములను గత ప్రభుత్వంలో పూడ్చి వేశారు. ఈ గండి నుంచి ఐదు కాలువల ద్వారా దిగువ ఆయకట్టు ప్రాంతానికి నీటిని అందించేవారు. ఈ కాలువలకు సంబంధించి సుమారు 500 ఎకరాలకు పైగా ఆయకట్టు ప్రాంతం ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం కాలువల తూములను పూడ్చడంతో కంచాలమ్మ గండిచెరువు కింద ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా మారాయి. గ్రామ టీడీపీ నాయకుడు వీరబల్లి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకెళ్లి పూడ్చివేసిన కాలువలను పునరుద్ధరించి కంచాలమ్మ గండిచెరువు కింద భాగంలోని ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని విన్నవించారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 5: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో వెలిసియున్న దక్షిణకాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేద మంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ఆలయ మాడవీధుల్లో బ్యాండు మేళాలు, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నడ భక్తులతో పాటు భక్తులు పల్లకీ ఉత్సవంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడిని దర్శించుకుని మంగళహారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు పల్లకీ ఉత్సవం విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

బస్సు సర్వీసు ప్రారంభానికి ఏర్పాట్లు సిద్ధం

వీరబల్లి, ఆగస్టు 5: సుండుపల్లె వాసుల విన్నపం మేరకు పీలేరు-రాజంపేట బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు పీలేరు డిపో మేనేజరు బండ్లకుమార్, సర్పంచ్ నేతి ఆంజనేయులు పేర్కొన్నారు. సానిపాయిలో సోమవారం ఈ బస్సు సర్వీసు ట్రైల్ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటగా ట్రైల్‌రన్ చేసి అనంతరం 8వ తేదీ నుంచి పీలేరు నుంచి ఒకటి, రాజంపేట నుంచి ఒక్క బస్సు సర్వీసు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ బస్సు సర్వీసు పీలేరు నుంచి ప్రారంభమై సుండుపల్లె, సానిపాయి మీదుగా రాజంపేటకు వెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రామాశ్రీనివాస్, రైతుసంఘం సేవా మిత్ర అధ్యక్షుడు సుబ్బరామరాజు, రాజంపేట హెచ్‌ఆర్‌ఎస్సీ ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేక అవస్థలు

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 5: రాయచోటి పట్టణంలో వున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేక చాలా మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా ఆర్ఐఓకు ఎన్నిసార్లు విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు డీఆర్‌ఓకు అర్జీ ద్వారా తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకుండా పోయిందని, అలాగే మరుగుదొడ్లు చాలా అధ్వానంగా వున్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాలపై ప్రిన్సిపాల్‌కు అనేక సార్లు ఫిర్యాదు చేశామని, జిల్లా అధికారులు హాస్టళ్లు, కళాశాలలను తనిఖీ చేయడం లేదని డీఆర్‌ఓకు తెలియజేశారు.

దేశ సమగ్రత, సమైక్యత కోసం పాదయాత్ర

రైల్వేకోడూరు, ఆగస్టు 5: దేశ సమగ్రత, సమైక్యత కోసం పాదయాత్ర చేస్తున్నట్లు శివకరణ్‌సింగ్‌స్వామి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు పాదయాత్ర చేరుకుంది. భుజంగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీ నుంచి కన్యాకుమారీ వరకు 2022 నుంచి కాశీ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. లోక కళ్యాణంకు ఈ పాదయాత్ర ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకుడు దశరథరామయ్య, విశ్వహిందూ పరిషత్ నాయకులు దరిశా వెంకటరెడ్డి, అదునుకోట నరసింహులు, మనోహర్ ఆచారి, కాళప్పగారి రాము, సాయం శ్రీధర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు 196..పోలీసు శాఖకు 39 అర్జీలు







అర్జీలు స్వీకరిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసి-కలెక్టరేట్ వద్ద స్కీం వర్కర్ల నిరసన-నిరసన తెలుపుతున్న మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్లు

చిత్తూరు, ఆగస్టు 5: కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు హాజరయ్యారు. డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసీ, డిప్యూటీ కలెక్టర్ భవానీ వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టరేట్‌కు 196.. పోలీసు శాఖకు 39 అర్జీలు వచ్చాయి. వాటిలో కొన్ని..

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

జిల్లాలో తొలగించిన స్కీం వర్కర్లు, వీవోఏ, ఆర్పీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి క్షేత్రస్థాయి సహాయకులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లను కూటమి ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్కీం వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు కోరారు. ఎలాంటి షోకాజ్ నోటీసులూ ఇవ్వకుండా 350 మందిని తొలగించడం అన్యాయమన్నారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసనలో సీఐటీయూ నేతలు సురేంద్రన్, గిరిధర్‌గుప్తా, ఓబుల్‌రాజు, లలిత, షకీలా, గంగ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రభుత్వాస్పత్రుల్లోని శానిటరీ కార్మికులకు ఐదునెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆరేళ్లుగా యూని ఫాం ఇవ్వలేదని, ఈఎస్ఐ సేవలు అమలు కావడం లేదన్నారు. ఖాళీలను భర్తీ చేసి, కనీస వేతనం రూ.16 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫుల్లా

● తన కుమారుడు శివకుమార్ చౌకదుకాణ అనుమతిని పునరుద్ధరించాలని పలమనేరు గాంధీ నగర్‌కు చెందిన నాగరాజు కోరారు. పాఠశాలకు బియ్యం సక్రమంగా ఇవ్వలేదనే కారణంగా 2022లో దుకాణ నిర్వహణ బాధ్యత నుంచి తప్పించి వీఆర్వో ఆధ్వర్యంలో సరుకుల పంపిణీ జరుగుతోందన్నారు. జరిమానా విధించి, అనుమతి ఇవ్వాలని ఈ ఏడాది జనవరిలో జిల్లా యంత్రాంగం ఉత్తర్వులిచ్చినా అమలు కాలేదన్నారు.

● తమ అనుభవంలో ఉన్న భూముల్లో వ్యవసాయం చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని సోమల మండలం సూరయ్యగారిపల్లె ఎస్టీకాలనీకి చెందిన రైతులు వాపోయారు. ఈ భూములు అగ్రకులస్థుల చేతిలో ఉన్నాయని, విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

● పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 39 వినతులు వచ్చాయి. ఎస్పీ ఆరీఫుల్లా వినతిపత్రాలను స్వీకరించారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 5: జిల్లాలోని ఏడు ప్రభుత్వ, పది ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7799933370ను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐలకు ఈనెల 29న, ప్రైవేటు ఐటీఐలకు ఈనెల 31న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

మాజీ ఉద్యోగులకు పెన్షన్లు ఇంకా రాలేదు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5: ప్రభుత్వ పెన్షన్‌దారులకు 6వ తేదీ అవుతున్నా ఇంతవరకు పింఛన్ మొత్తాలు విడుదల కాలేదు. జిల్లావ్యాప్తంగా 12,505 మంది ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు. ఖజానా ఎస్టీవోలు ప్రభుత్వ పెన్షనర్ల పింఛన్ బిల్లులు గత నెల 24వ తేదీ అప్రూవ్‌చేసి డేటా పంపారు. సీఎఫ్ఎంఎస్ బిల్లులను 30న పరిశీలించి, తిరిగి ఎస్టీవోలకు పంపగా వాటిని వారు ఓకే చేసి టోకెన్లు మంజూరు చేశారు. 31న సీఎఫ్ఎంఎస్ పెన్షన్లు చెల్లింపులకు ఆమోదం తెలిపి ఈ-కుబేర్‌కు పంపింది. కానీ ఉద్యోగులకు జీతాలు ఈనెల ఒకటిన పడినా, పెన్షన్లు మాత్రం జమ కాలేదు.

కేంద్రియ విద్యాలయ ఏర్పాటులో ముందడుగు

● స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం



స్థల పరిశీలన చేస్తున్న కేంద్ర బృందం

చిత్తూరు సిటీ/చిత్తూరు రూరల్, ఆగస్టు 5: చిత్తూరులో కేంద్రియ విద్యాలయ ఏర్పాటుకు ముందడుగు పడింది. సోమవారం కేంద్ర బృందం స్థలాన్ని పరిశీలించింది. వైసీపీ హయాంలోనే మంజూరైనా స్థలాన్ని చూపించడంలో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. కూటమి అధికారంలో వచ్చాక ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వేర్వేరుగా కేంద్రియ విద్యాలయ అధికారులకు లేఖలు రాశారు. ఈ క్రమంలో కేంద్రియ విద్యాలయ రీజనల్ కోఆర్డినేటర్ మంజునాథ్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ మంగసముద్రంలో కార్పొరేషన్ అధీనంలోని స్థలాన్ని సందర్శించారు. భూమి పత్రాలను పరిశీలించారు. ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణుడు, తహసీల్దార్ కళావతి, పీఎన్‌సీ మునిసిపల్ హైస్కూల్ హెచ్ఎం వేదవతి కమిటీకి అవసరమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎమ్మెల్యే గురజాల సూచనల మేరకు టీడీపీ నేతలు వసంత్ కుమార్, ముత్తు రవితేజ, ఈశ్వర్, మధుబాబు, చిట్టి బాబు, కోడిబాబు తదితరులు అధికారులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు.

టీడీపీ నేతలపై దాడులు

● వైసీపీకి చెందిన సర్పంచిపై బాధితుల ఫిర్యాదు



గాయపడిన గుణశేఖర్

వెదురుకుప్పం, ఆగస్టు 5: వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లె సర్పంచి రాజశేఖరరెడ్డి తమపై దాడులకు, మారణాయుధాలతో దౌర్జన్యం చేస్తున్నారని టీడీపీ నేత విజయనరసింహారెడ్డి, టీడీపీ ఎస్సీ నాయకుడు గుణశేఖర్ సోమవారం తెలిపారు. తనపై ఆదివారం జరిగిన దాడికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గుణశేఖర్ తెలిపారు. 'తిప్పినాయుడుపల్లె కాలనీకి చెందిన నేను టీడీపీ నేతను. ఆటో నడుపుకొంటున్నా. మా సర్పంచి రాజశేఖర్‌రెడ్డి గ్రామ సమీపంలో మట్టి అక్రమ రవాణాకు పాల్పడటంపై అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆదివారం సాయంత్రం నేను ఆటోలో తిప్పినాయుడుపల్లె కాలనీకి వెళ్తుండగా రెండు ట్రాక్టర్లు, రెండు ఎక్స్‌కవేటర్లను అడ్డుపెట్టి అటకాయించాడు. కులం పేరుతో దూషించి, చంపేస్తానని బెదిరించాడు. అనుచరులతో కలసి నాపై దాడి చేశాడు. ప్రాణభయంతో పరుగులు పెట్టిన నన్ను కొందరు 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం వచ్చి సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు చేశాను' అని గుణశేఖర్ చెప్పారు.

● తనపైనా సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, అనుచరులు ఆదివారం మారణాయుధాలతో దాడికి వచ్చారని, ఆ సమయంలో గ్రామస్తులు ఉండటంతో ప్రాణాలతో బయట పడ్డానని తిప్పినాయుడుపల్లెకు చెందిన టీడీపీ నేత విజయనరసింహారెడ్డి తెలిపారు. అతడిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని కోరారు. లేకపోతే అతడి వల్ల స్థానికంగా చాలా మందికి ప్రాణహాని ఉందన్నారు.

'నిబంధనల మేరకే సీనియారిటీ జాబితా'

చిత్తూరు రూరల్, ఆగస్టు 5: నిబంధనల మేరకే జడ్పీలో సీనియారిటీ జాబితాను రూపొందించారని, ఇందులో అవకతవకలు జరగలేదని పీఆర్ మినిస్టీరియల్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది అనర్హులు జిల్లా అసోసియేషన్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు, పదోన్నతులు నిలుపుదల చేయడానికి అసత్యప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా సీనియారిటీ జాబితాను పంపించామని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టులో దోపిడీ: ఆర్సీవై

పుంగనూరు, ఆగస్టు 5: పోలవరం ప్రాజెక్టులో గడిచిన కొన్నేళ్లుగా దోపిడీ తప్ప పనుల్లో ప్రగతి కనిపించలేదని బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులలను పరిశీలించినట్లు తెలిపారు. సాంకేతికంగా చేయాల్సిన పనులు చేయకుండా కమీషన్లు, కాసుల కోసం అత్యవసరంగా కొన్ని పనులు చేశారని మండిపడ్డారు. మొత్తం 1.06 లక్షల మందికి పునరావాసం కల్పించాల్సివుండగా 20 ఏళ్లుగా కేవలం 12శాతం మందికి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం ప్రాజెక్టు పూర్తయ్యే సరికి 100శాతం పునరావాసం కల్పించాలన్నారు. కేంద్ర నిధులతో రానున్న రెండేళ్లలోపు ప్రాజెక్టు పూర్తిచేసి రైతులకు నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- 12 దుంగలు, రెండు బైక్‌ల స్వాధీనం



మంగళం, ఆగస్టు 5: నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి.. 12దుంగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనలతో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ టీమ్ స్థానిక అటవీశాఖ అధికారుల సాయంతో సోమవారం వెంకటగిరి ఫారెస్టు రేంజ్‌కి వెళ్లి డక్కిలి అటవీప్రాంతం వైపు, సీసీ కండ్రిగ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున వెంకటగిరి హిల్స్ వద్ద రెండు బైక్‌లపై కొందరు వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వీరిని వెంకటగిరి మండలానికి చెందిన వెంకటేష్(44), పారవేలు పెంచలయ్య(42), త్రిపురాంతపల్లి వెంకటేష్(44),రేణిగుంట మండలానికి చెందిన కొల్లంగుంట సురేష్‌బాబు(39)గా గుర్తించారు. విచారించి, వారు దాచి ఉంచిన 12ఎర్రచందనం దుంగలను, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారైన మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనబాహుళ్యంలోకి సంస్కృత విజ్ఞానం

సిద్ధాంత సంస్థతో ఎన్ఎస్‌యూ పరస్పర చర్చలు

తిరుపతి రూరల్, ఆగస్టు 5: సంస్కృత విజ్ఞానాన్ని అధునాతన టెక్నాలజీ ద్వారా జన బాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ)తో చెన్నైకి చెందిన సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం పరస్పర అవగాహన చర్చలు జరిపారు. వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఇతర అధికారులతో కలిసి సిద్ధాంత సంస్థ ఛైర్మన్ జయకృష్ణ, శాస్త్రవేత్తలు సుదర్శన్, లక్ష్మి, ఆత్రేయ సత్యనారాయణ, మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు. వైదిక కృషి విజ్ఞానం, ప్రాచీనపాకశాస్త్రం, గణితం, సంస్కృత వినోదం, ప్రశ్నాశాస్త్రం, సిద్ధాంత జ్యోతిషం అంశాలపై చర్చించి, రానున్న రోజుల్లో వీటిపై ఎంవోయూ చేసుకోవాలని నిర్ణయించారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అధ్యాపకులు కేఎస్ సతీశ, గణపతిభట్, శంకర్‌నారాయణ, సూర్యనారాయణ, చంద్రశేఖరం తదితరులు పాల్గొన్నారు.

పొలాలను అటవీ భూములుగా మార్చారు

● పెద్దిరెడ్డిపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విమర్శ



సీతమ్మ చెరువు వద్ద రైతులతో మాట్లాడుతున్న మంత్రి

సోమల, ఆగస్టు 5: రైతుల భూములను.. అటవీ భూములుగా రికార్డులు సృష్టించిన ఘనత పెద్దిరెడ్డికే దక్కుతుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. సోమల మండలంలోని సూరయ్యగారిపల్లె, నంజంపేట, మల్లేశ్వరపురం, ఆవులపల్లెలో సోమవారం మంత్రి పర్యటించారు. సీతమ్మచెరువు రిజర్వాయర్ వద్దకు చేరుకున్న ఆయన.. పెద్దిరెడ్డి చేపట్టిన ప్రాజెక్టు పనులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. చిన్న చెరువును ప్రాజెక్టుగా మార్చేందుకు రూ.800 కోట్లు మంజూరు చేయించుకుని స్వాహాచేసేలా ప్రయత్నించారని ఆరోపించారు. వందల ఏళ్ల నుంచి సాగులోని రెవిన్యూ భూములను అటవీశాఖకు చెందినవిగా రికార్డులు సృష్టించి రైతులను వేధించి, వారిపైనే అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశాడని విమర్శించారు. రైతులకు నష్టపరిహారం మంజూరు కాకనే పనులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆవులపల్లె, రామకృష్ణాపురం, బయ్యారెడ్డిపల్లె తదితర ముంపు భూముల రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని తెలిపారు. జేసీ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమీక్షించారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, బీజేపీ కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి, శ్రీనివాసులు నాయుడు, హరిప్రసాద్, కామిశెట్టి నగేశ్, వేణుగోపాల్ నాయుడు, రమేశ్‌నాయుడు, బాల సుబ్రమణ్యం, శివశంకర్, విశ్వనాథం, లక్ష్మీపతి నాయుడు, పట్టాభి నాయుడు, రవి నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో భారీ వర్షం







హైవేలో భారీగా నిలిచిన వర్షపునీరు, వర్షపునీటిలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు, ముంగరమడుగులో నీటమునిగిన వరి

బంగారుపాళ్యం, ఆగస్టు 5: ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొన్నాయి. సోమవారం బంగారుపాళ్యంలో భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలసేపు ఏకధాటిగా కురవడంతో చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలో భారీగా నీళ్లు చేరాయి. దీంతో విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఎప్పుడు వర్షం వచ్చినా ఈ రోడ్డులో భారీగా నీళ్లు నిలిచి.. పక్కనున్న దుకాణాలు, ఇళ్లల్లోకి చేరుతోంది. ముంగరమడుగు, జంబువారిపల్లి, ఎర్రాండ్లపల్లి, జయరామపురం, 170 గొల్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు గత వారం క్రితం వేసిన వరిపంటల నుడుల వరకు వర్షపు నీటి చేరాయి. దీంతో వరిపంటలు వేసిన రైతులు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు

చిత్తూరు కలెక్టరేట్: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తున్నాయి. అత్యధికంగా పూతలపట్టులో 30.4, అత్యల్పంగా శ్రీరంగరాజపురంలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది. నిండ్రలో 15.2, విజయపురం 13.6, గంగాధరనెల్లూరు 13.2, చిత్తూరు రూరల్ 13.0, చిత్తూరు అర్బన్ 7.0, పాలసముద్రం 3.2, తవణంపల్లె 2.8, వెదురుకుప్పం 2.4, నగరి 2.2, గుడిపాల 2.2, యాదమరి 1.8, శాంతిపురం 1.2, పెనుమూరులో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి



అధికారులకు సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 5: స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని జేసీ శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై సోమవారం రాత్రి ఆయన కలెక్టరేట్‌లో డ్వామా పీడీ రాజశేఖర్‌తో కలసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం నిర్ణయించిన ముఖ్య అతిథి హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం వారి ప్రసంగం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసా పత్రాలందించడం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పరేడ్ కార్యక్రమాన్ని పోలీసు శాఖ నిర్వహించాలని, వేదిక ఏర్పాట్లను రెవిన్యూ డివిజనల్ అధికారి, స్థానిక తహసీల్దార్ పర్యవేక్షిస్తారని తెలిపారు. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకటాలను ప్రదర్శించాలని సూచించారు. శకటాల ప్రదర్శనకు ఆసక్తి చూపే శాఖల అధికారులు డ్వామా పీడీని సంప్రదించాలన్నారు. పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ స్టాల్స్‌కు ఆసక్తిచూపే శాఖల అధికారులు డీఆర్డీఏ పీడీ తులసిని సంప్రదించాలని సూచించారు. ఆస్తు ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్డీఏ పీడీ పరిశీలించాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా, స్టేజ్ డెకరేషన్, సెక్యూరిటీ, పరేడ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పోలీసుశాఖ, చిత్తూరు నగరపాలక సంస్థ పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రౌండ్‌లో మెడికల్ క్యాంపు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అరీఫుల్లా, డీఎస్వో శంకరన్, డీఎస్పీ మహబూబ్ బాషా, జడ్పీ సీఈవో గ్లోరియా, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణుడు, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డీఎం మోహన్‌బాబుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక, పాండిచ్చేరి మద్యం స్వాధీనం

● ఇద్దరి అరెస్టు
● ద్విచక్ర వాహనం, బస్సు సీజ్





కర్ణాటక మద్యంతో పట్టుబడిన మంజునాథను అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు, పాండిచ్చేరి నుంచి మద్యం తీసుకొస్తున్న వ్యక్తిని, ప్రైవేటు బస్సును అదుపులోకి తీసుకొన్న అధికారులు

పలమనేరు, ఆగస్టు 5: కర్ణాటక, పాండిచ్చేరి నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని సోమవారం పలమనేరు ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు గ్రామానికి చెందిన మంజునాథ స్కూటర్‌లో 384 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు తీసుకొస్తున్నాడు. పలమనేరులోని పద్మశ్రీ సర్కిల్ వద్ద అతడిని పట్టుకుని అరెస్టు చేశారు. స్కూటర్‌ను సీజ్ చేశారు. అలాగే, మదనపల్లెకు చెందిన కరమలాచారి అనే వ్యక్తి ప్రైవేటు ట్రావెల్స్‌లో పాండిచ్చేరికి చెందిన 120 మద్యం ఫుల్ బాటిళ్లు తీసుకొస్తున్నాడు. పలమనేరు సమీపంలోని ఫ్లైవోవర్ వద్ద పట్టుకొని, మద్యం స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేశారు. ట్రావెల్స్ బస్సును కూడా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ దత్తాత్రేయ, హెడ్‌కానిస్టేబుల్ దేవరాజులు, కానిస్టేబుళ్లు సతీష్‌బాబు, సయ్యద్‌బాషా, అల్తామస్, చక్రినాయక్, సుబ్బయ్య, మురళి పాల్గొన్నారని సీఐ తెలిపారు.

బోయకొండ గంగమ్మకు హుండీ ఆదాయం రూ.86 లక్షలు



ఆలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, ఆగస్టు5: బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.86.85 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో ఏకాంబరం సోమవారం తెలిపారు. ఇంకా, 33 గ్రాముల బంగారు, 690 గ్రాములు వెండి, యూఎస్ఏ డాలర్ ఒకటి, బంగ్లాదేశ్ కరెన్సీ టకా 10, 20, 100 నోట్లు ఒక్కొక్కటి, సౌదీ అరేబియా కరెన్సీ ఒక రియాల్‌ను భక్తులు సమర్పించారన్నారు. ఈ ఆదాయం 37 రోజులలో వచ్చినట్లు తెలిపారు. రణబేరిగంగమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.69,888 నగదు వచ్చిందన్నారు. గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి మట్టిదందా

వెదురుకుప్పం, ఆగస్టు 5: మండలంలోని తిప్పినాయుడుపల్లె సర్పంచ్ రాజశేఖరరెడ్డి మట్టిదందాకు పాల్పడుతున్నాడని, ఈ విషయమై వీఆర్వోకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని తిప్పినాయుడుపల్లె టీడీపీ నాయకులు విజయనరసింహారెడ్డి, గుణశేఖర్ ఆరోపించారు. సోమవారం వెదురుకుప్పంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి తిప్పినాయుడుపల్లె పంచాయతీ పరిధిలో పలుచోట్ల మట్టి తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నాడని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు సైతం తరలిస్తున్నాడని చెప్పారు. లోపాయికారి ఒప్పందం వల్ల రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, అడ్డుకోకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

డెంగ్యూతో విద్యార్థిని మృతి

పుంగనూరు రూరల్, ఆగస్టు 5: మేలుపట్లలోని గిరిజన వసతి గృహంలో చదువుతున్న పూర్ణిమ(11) డెంగ్యూతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. సోమల మండలం 81చిన్న ఉప్పరపల్లె పంచాయతీ ఇర్లపల్లెకు చెందిన వెంకటరమణ, ఈశ్వరమ్మల కుమార్తె పూర్ణిమ గిరిజన వసతి గృహంలో ఏడో తరగతి చదువుతోంది. కొన్నిరోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నా వార్డెన్ పట్టించుకోలేదని, వారంరోజుల తర్వాత తమకు సమాచారం ఇచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. పూర్ణిమను తల్లిదండ్రులు తీసుకెళ్లి సోమలలో ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించగా, సకాలంలో తీసుకురాకపోవడంతో మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పినట్లు తెలిసింది.

సబ్‌కలెక్టర్‌ను కలసిన డీఎస్పీ


సబ్‌కలెక్టర్‌ను కలసిన డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె టౌన్, ఆగస్టు 5: మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌ను సోమవారం డీఎస్పీ కొండయ్య నాయుడు సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజలకు రెవె న్యూ, పోలీసు శాఖలసేవలు సంయుక్తంగా అందించే విషయమై చర్చించారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

పీలేరు, ఆగస్టు 5: పీలేరు తహసీల్దారుగా నియమితులైన భీమేశ్వర రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రెవెన్యూ కార్యకలాపాలు సాగిస్తూ ప్రజలకు చేరువవుతామన్నారు. ఆయనను స్థానిక సిబ్బంది అభినందించారు.

నిమ్మనపల్లి తహసీల్దార్‌గా ధనంజయులు

నిమ్మనపల్లి, ఆగస్టు 5: నిమ్మనపల్లి మండల తహసీల్దార్‌గా ధనంజయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన బాలాజిరాజు అనంతపురానికి బదిలీ కాగా, కడపలో దహసీల్దార్ పని చేస్తున్న ధనంజయులు బదిలీపై నిమ్మనపల్లి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై సిబ్బంది చొరవ చూపాలని, ఎలాంటి అక్రమాలను తావు లేకుండా పని చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

రామసముద్రం తహసీల్దార్‌గా నిర్మలాదేవి..

రామసముద్రం, ఆగస్టు 5: రామసముద్రం తహసీల్దార్‌గా కె.నిర్మలాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే కిశోర్ నివాళి


గణేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లారి

గుర్రంకొండ, ఆగస్టు 5: గుండెపోటుతో మృతి చెందిదన టీడీపీ కార్యకర్త గణేష్(29)కు సోమవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. మండలంలోని నడిమికండ్రిగకు వెళ్లి గణేష్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్ర మంలో నాయకులు జగదీష్‌కుమార్, ప్రసాద్ నాయుడు, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, నౌషాద్‌అహ్మద్, జయ సూరి, క్రాంతి, మహాత్మారెడ్డి, ప్రకాశ్, చంద్రబాబు, ఆనం ద్, బయ్యారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ప్రదీప్, సాగర్, సుంకర శేఖర్, చలపతి, సుధాకర్, రంజిత్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కలికిరి, ఆగస్టు 5: కలికిరి క్రాస్ రోడ్డులో గత శుక్రవారం తీవ్ర అనారోగ్యానికి గురయిన గుర్తు తెలియని వ్యక్తిని స్థానిక పోలీసులు అంబులెన్స్ సాయంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను సోమవారం వేకువ జామున మృతి చెందినట్లు పో లీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యక్తిని గుర్తించిన వారు కలికిరి పోలీసు స్టేషనుకు సమాచారం అందజేయాలని కోరారు.

పాము కాటుతో మహిళకు అస్వస్థత

తంబళ్లపల్లె, ఆగస్టు 5: పాము కాటు వేయడంతో ఓ మహిళా రైతు అస్వస్థతకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ కొప్పలవారిపల్లెకు చెందిన శివశంకర్ భార్య సుజాత(42)పొలం పనులు చేస్తుండగా ఆమె కాలిపై విషసర్పం కాటు వేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబీకులు వెంటనే మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య చికిత్సలు అందించగా మహిళ కోలుకుంటోంది.

రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి

రామసముద్రం, ఆగస్టు 5: తమిళనాడులోని రాణీపేట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి చెందాడు. రామసముద్రం మండలం భూసానికురప్పల్లెకు చెందిన రైతు కె.రామచంద్ర (50) ఆదివారం సాయంత్రం క్యాలీ ఫ్లవర్‌ను ఐషర్ వాహనంలో చెన్నై మార్కెట్టుకు తీసు కెళ్తుండగా రాణీపేట వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వాహనం బోల్తా పడింది. దీంతో రామచంద్ర అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

బి.కొత్తకోట, ఆగస్టు5: ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష రాసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో రెడ్డిశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరాదాయం రూ.3.50 లక్షలకు మించకుండా ఉండాలన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ లకు రూ.100, కాగా ఎస్సీ, ఎస్టీలకు రూ.50 ఆన్‌లైన్‌ద్వారా ఎస్బీఐ ఖాతాకు చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబరు 12 నిర్వహించబోయే ఈ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఆగస్టు 5 నుంచి, సెప్టెంబరు 6 వరకు ఉంటుంది. ఆసక్తి గల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్కాలర్‌షిప్ పొందవచ్చునని ఆయన తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

తంబళ్లపల్లె, ఆగస్టు 5: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి మూడో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 8 సీట్లు, ఫిట్టర్‌లో 15 సీట్లు, సివిల్‌లో 10 సీట్లు ఖాళీలున్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. ఈ నెల 28వ తేదీ లోపల తంబళ్లపల్లె ఐటీఐలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ కోరారు.

వర్గీకరిస్తే.. ఉద్యమిస్తాం

● మాలమహానాడు హెచ్చరిక


ఆందోళన చేస్తున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు5: ఎస్సీ వర్గీకరణ చేస్తే ఉద్యమిస్తామని మాల మహానాడు నేతలలు హెచ్చరించారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ సోమవారం మాలమహానాడు నేతలు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం మాట్లాడుతూ వర్గీకరణ దళితులను విడదీస్తుందన్నారు. గతంలో చంద్రబాబు ఓట్ల కోసం మాల మాదిగలను నిలువునా చీల్చారన్నారు. 2004లో పీవీ రావు, చెన్నయ్య సుప్రీంకోర్టు కెళ్లి ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్రాలకు వర్గీకరణ చేసే అధికారాలు లేవని తీర్పు పొందారని గుర్తు చేశారు. కానీ మోడీ తన అధికార దర్పంతో తిమ్మిని బొమ్మిని చేసి వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని తీర్పు వచ్చేలా చేశారని ఆరోపించారు. ఇలాంటివి ప్రజాస్వామ్యానికే వ్యతిరేకమన్నారు. వర్గీకరణ నిలిపివేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు యమలా చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్, శేఖర్, రమణ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ చెల్లించకుండా సామగ్రి తరలిస్తే సహించం



మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5: కార్మికులకు పీఎఫ్ చెల్లించేవరకు మదనపల్లె స్పిన్నింగ్‌మిల్ సామగ్రిని తరలించరాదని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జేవీ నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి మాదవ్‌రెడ్డి కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ చెల్లించాలంటూ 14 ఏళ్లగా కోర్టు ద్వారా పోరాటాలు చేశామన్నారు. బెంగళూరు కోర్టు ద్వారా రూ.9 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఇది క్లియర్ కాకుండా సామగ్రిని తరలించరాదన్నారు. మిల్లును కొనుగోలు చేసిన తిరుపతికి చెందిన గిరిధర్‌రెడ్డి కార్మికులకు బోనస్‌గా రూ. రెండు కోట్ల విలువైన చెక్కులను ఇచ్చినట్లు మోసపూరితంగా సంతకాలు సేకరించి కోర్టుకు సమర్పించాడని ఆరోపించారు. 64 మంది కార్మికులు కలిసి మిగిలిన కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగేవరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఉపాధ్యక్షుడు వై. రాజారెడ్డి, జాయింట్ సెక్రటరీలు వి. నాగరాజ, రఘునాథరెడ్డి, వెంకటరత్నం, ఈ. శివారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, కోశాధికారి ఎం. వెంకటరమణారెడ్డి, సభ్యులు సురేంద్ర, శేషాచలపతి, శంకర్‌రెడ్డి, రమణారెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీని బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న జనసేనపార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్

పెద్దమండ్యం, ఆగస్టు 5: జనసేన పార్టీని బలోపేతం చేయాలని తంబళపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ పిలుపు నిచ్చారు. మండలంలోని పెద్దమండ్యం, సిద్దవరం, కలిచెర్ల గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదు వివరాలను ఆ పార్టీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనసేన పారీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తంబళ్లపల్లి నియోజక వర్గంలో పార్టీ సభ్యత్వం నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 2500 మందిని చేర్చుకున్నట్లు వివరించారు. ముందుగా ఆయన కూటమి నేతలతో కలసి పెద్దమండ్యం మండల అధికారులు, జీఎస్ సిబ్బందితో మాటాడారు. సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను అందజేశారు. ప్రజా సమ స్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రుక్మాంగదరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు శంకర మాజీ సర్పంచ్ నాగార్జున కూటమి నేతలు సిద్దవరం ప్రసాద్, దత్తాత్రేయరెడ్డి, ప్రభాకరరెడ్డి, సయ్యద్‌షావలి, ఇస్మాయిల్, బావాజీ, ప్రకాష్‌రెడ్డి, మేకల చలపతి, నాగూరువలి, అస్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించండి


సిబ్బందితో సమీక్షిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దారు ఇషాక్

తంబళ్లపల్లె, ఆగస్టు 5: మండలంలోని రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఇషాక్ వీఆర్వోలకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలు అందుబాటులో ఉండి ప్రజలు, రైతుల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు . రేషన్ పంపిణీని పర్యవేక్షిస్తూ కార్డుదారులకు సకాలంలో సరుకులు అందేవిధంగా చూడాలన్నారు. బాధ్యతతో విధులు నిర్వహించా లని సూచించారు. కార్యక్రమంలో డీటీ మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయండి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దమండ్యం, ఆగస్టు 5: గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరవణయ్య, ఈవోఆర్డీ శ్రీధర్‌రావు సూచించారు. పెద్దమండ్యం పరిధిలోని చెరువుకింద పల్లితో పాటు సిద్దవరం, బండమీదపల్లి గ్రామ పంచాయతీల్లో సోమవారం పారిశుధ్య పనులు ప్రారంభించారు. దోమల నివారణకు పాగింగ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. సర్పంచులు బాషా, బయ్యారెడ్డి, విజయకుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జగన్, శైలజ, జనార్దన, శేషాద్రి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

పెద్దమండ్యం, ఆగస్టు 5: మండలంలోని దిగువపల్లిలో సోమవారం మదనపల్లి న్యా య విజ్ఞాన సదస్సు మండల న్యాయ సేవా సహాయ సంస్థ, ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దిగు వపల్లి, దేవళంతండా, తుమ్మలవంక తండాలకు చెందిన 196 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వేడి చేసి చల్లార్చిన మంచినీరు తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రిలో దోమ తెరలు వాడాలన్నారు. జీఎస్ సిబ్బంది వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పెద్దమండ్యం పీహెచ్‌సీ, ఆయుష్ డాక్టర్లు ఇమ్మానియేల్, మహబూబ్‌బాష, సీహెచ్‌వో క్రిష్ణయ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 3 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె

పెద్దమండ్యం, ఆగస్టు 5: మండలంలోని సిద్దవరం గ్రామ పంచాయతీ బాటవారిపల్లిలో కుక్కల దాడిలో మూడు గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు ఓబులేసు, శివారెడ్డి తెలిపారు. సోమవారం మేతకు వెళ్లి వచ్చి మందలో ఉన్న గొర్రెలపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో మూడు గొర్రెలు మృత్యువాత పడగా మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. గాయపడిన గొర్రెలు బతకడం కష్టమని బాధితులు చెబుతున్నారు. ఈ సంఘటనతో సుమారు రూ. 40వేలు నష్టం వాటిల్లినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. పశు వైద్య అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. ప్రదానంగా గ్రామాలలో కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మదనపల్లె తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యాలయ సిబ్బంది

మదనపల్లె అర్బన్, ఆగస్టు5: మదనపల్లె తహసీల్దార్‌గా కె. ఖాజాబీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యా లయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అంతకు ముందే ఆమె మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఆయన స్వగృహం వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభు త్వ భూములు అక్రమాలకు గురి కాకుండా కాపాడుతానని తెలిపారు. కార్యక్రమంలో డీటీ బావజాన్, ఆర్ఐ రెడ్డెప్ప, సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన జనసేన నేతలు


డీఎస్పీని సన్మానిస్తున్న జనసేన నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగసు 5 : డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడును సోమవారం ఆయన కార్యాలయంలో మదనపల్లె జనసేన ఇన్‌చార్జి, రాయలసీమ కో- కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం ఇతర నాయకులతో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. ఎలాంటి అసాంఘిక సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాల న్నారు. కార్యక్రమం లో జిల్లా సంయుక్త కార్యదర్శి గజ్జెల రెడ్డెప్ప, మదనపల్లె మండల అధ్యక్షుడు గ్రానైట్ బాబు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ తారకరామ ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి గౌతమ్, నాయకులు హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

కాపు సొసైటీ సభ్యుల సన్మానం

స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నూతన డీఎస్పీ డి. కొండయ్య నాయుడును రిటైర్డ్ ఏఎస్పీ నడిమిదొడ్డి పెద్దయ్యతోపాటు శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాలయ సొసైటీ ఫౌండర్ టీఎస్ నరసయ్య, టి.పవన్ తేజ్, శ్రీరాముల నాయుడు కలిసి పుష్పగుచ్ఛంతోపాటు శ్రీకృష్ణదేవరాయల చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె డివిజన్ పరిధిలో ఎలాంటి అన్యాయాలు, అక్రమాలు జరగకుండా చూడాలని డీఎస్పీకి విన్నవించారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని కోరారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించండి


ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బందితో సీడీపీవో భాగ్యమ్మ

బి.కొత్తకోట, ఆగస్టు5: తల్లిపాల ఆవశ్యకతపై ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త ఆయా గ్రామాలలో అవగాహన కల్పించాలని బి.కొత్తకోట ప్రాజెక్ట్ సీడీపీవో భాగ్యమ్మ సూచించారు. సోమవారం ప్రాజెక్టు కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల, సెక్టార్, గ్రామస్థాయిలలో సైతం వారోత్సవాలు నిర్వహించి ముర్రుపాల విశిష్టతను తల్లులకు వివరిస్తామన్నారు. అంతకు మునుపు పట్టణంలో అంగన్వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు, బ్యానం ‘ర్ల చేతపట్టి పోతపాలు వద్దు-ముర్రుపాలు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారానిమహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్లు జయరాణి, భవాని, గౌరీదేవి తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ములకలచెరువు, పీటీయం, బి.కొత్తకోట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా... మారని రంగులు


వైసీపీ రంగులో ఉన్న గేటు

పెద్దతిప్పసముద్రం అగస్టు 5 : కూటమి ప్రభుత్వం కొలువుతీరి నెలలు గడుస్తున్నా అధికారుల తీరు మాత్రం మారలేదు. గత ప్రభుత్వ హయాంలో కాలువ గేట్లకు శ్మశాన వాటికలకు, బస్సు షెల్టర్లకు వైసీపీ రంగులు వేశారు. అప్పట్లో ఈ రంగుల పిచ్చిపై ప్రజలు ఎన్ని విమర్శలు చేసినా అధికారులు కనీసం పట్టించుకోలేదు. అయితే ప్రభుత్వం మారినా అధికారులు అప్పటి తీరునే కొనసాగిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్దతిప్పసముద్రం మండల కేంద్రానికి సమీపంలో పీటీఎం పెద్దచెరువుకు, కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువుకు నీళ్ల వదిలేందుకు పీటీఎం శివారులో ఎత్తిపోతల గేట్లను అమర్చారు. ఈ గేట్లకు వైసీపీ హయాంలో ఆ పార్టీకి చెందిన రంగులను వేసి అంతా తామే చేసినట్లు ప్రకటించుకున్నా. కనీసం ఇప్పటికైనా సంబందిత అధికారులు ఈ వైసీపీ రంగులు మార్చాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనం దుంగలతో పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

పీలేరు, ఆగస్టు 5: ఒక వాహనంతో సహా 22 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకు ఎర్రచందరం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు తాము ఆదివారం రాత్రి 9 గంటల నుంచి కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. సోమవారం ఉదయం 2.30 గంటల ప్రాంతంలో పీలేరువైపు వస్తున్న నెంబరు లేని టయోటా ఇతియోస్ కారు తాము ఆపినా ఆగకుండా వేగంగా వెళ్లిపోయిందన్నారు. తాము ఆ వాహనాన్ని వెంబడించగా బెంగళూరు-తిరుపతి రహదారిలోని చెర్లోపల్లె వద్ద కారును ఆపివేసి, డ్రైవర్, మరో వ్యక్తి చీకటిలో పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా అందులో 349 కేజీలు బరువున్న 22 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం కూడా గాలింపు ముమ్మరం చేశామన్నారు. ఈ దాడిలో తనతోపాటు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది నాగేంద్ర బాబు, వెంకటేష్, మల్లికార్జున పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

లక్ష మొక్కల పెంపకమే లక్ష్యం


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె టౌన్, ఆగస్టు 5: పట్టణంలో లక్ష మొక్కల పెంపకమే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక రామగోపాల్‌నాయుడు వీధిలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటిన మొక్కలకు రక్షణ ఏర్పాటుకు దాతలు ఎవరైనా ముందుకొస్తే వారి పేర్లతో ట్రీగార్డులు ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు మునుపు ఎమ్మెల్యే తన నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు రామ కృష్ణాచారి, నాగార్జునబాబు, బాబునాయుడు, ముద్దుకృష్ణమనాయుడు, నవీన్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీవీబీ పాఠశాల కరస్పాండెంట్‌పై చర్యకు డిమాండ్


డీవైఈవో పురుషోత్తంకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5: విద్యార్థిపై దాడి చేసిన కర స్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని ఎస్పీవీబీ పాఠశాల ఎదురుగా సోమవారం దర్నా చేశారు. ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని మదనపల్లె డీవైఈవో శ్రీరాంపురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి వినయ్, మంజునాథ్, గణేష్, లిఖిత, హేమంత్, నాగరాజ, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ


గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారులు

కలికిరి, ఆగస్టు 5: పాడి పశువుల కోసం 75 శాతం సబ్సిడీతో జొన్న, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు కలికిరి ప్రాంతీయ పశు వైద్య కేంద్రం ఏడీ కె. వెంకటముని నాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని మర్రికుంటపల్లెలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతుల కోసం 1300 కిలోల జొన్న, 2700 కిలోల మొక్కజొన్న విత్తనాలను సిద్ధంగా వుంచినట్లు తెలిపారు. 5 కిలోల జొన్న విత్తనాల సంచికి రూ.345లు సబ్సిడీ పోనూ రూ.115లు రైతులు చెల్లించాలని, మొక్కజొన్న సంచికి సబ్సిడీ రూ.255 పోనూ రైతులు రూ.85 చెల్లించాలని కోరారు. ప్రస్తుతానికి విత్తనాలు గుండ్లూరు, మర్రికుంటపల్లె, పల్లవోలు, మునేళ్లపల్లె రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సర్పంచు రెడ్డిరాము, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటపతి, మండల తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనివాసులు, పశు వైద్యాధికారులు గిరినాథ్, గాయత్రి, పశు సహాయకురాలు కృష్ణవేణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మునెప్ప కాలనీలో తాగునీటి సమస్య తీర్చండి


మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 5: పట్టణంలోని మునెప్ప కాలనీలో నెల రోజుల నుంచి తాగునీటి సరఫరా సక్రమంగా లేదని మహిళలు వాపోయారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మునెప్ప కాలనీకి చెందిన మహిళలు మాట్లాడుతూ తమ కాలనీకి నెల రోజుల నుంచి తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంద న్నారు. పేదలైన తాము నీటి కోసం నెలకు రూ.1500 ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరిం చాలని కోరారు.

టీడీపీ సీనియర్ నేతకు ఎమ్మెల్యే నివాళి

పీలేరు, ఆగస్టు 5: పీలేరు మండలం జాండ్ల పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత చంద్రయ్య మృతదేహానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నివాళులు అర్పించారు. అనారోగ్య కారణాలతో చంద్రయ్య ఆదివారం బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన కుటుంబసభ్యులు చంద్రయ్య మృతదేహాన్ని ఆదివారం రాత్రి స్వగ్రామానికి చేర్చారు. ఈ విషయం తెలుసుకున్న నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి సోమవారం ఉదయం నివాళులు అర్పించడమే కాకుండా, వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని చంద్రయ్య కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, బాబ్జీ రెడ్డి, అన్నారెడ్డి, కోడిరామకృష్ణారెడ్డి, వసంతాల రాజా, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి చక్రాల కుర్చీల వితరణ


చక్రాల కుర్చీలు అందజేస్తున్న దాతలు

పీలేరు, ఆగస్టు 5: పీలేరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కంచి సూరి, ఆయన స్నేహితులు రామయ్య, హరినాథ నాయుడు, శ్రీనివాసులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి రెండు వీల్ చైర్లు అందజేశారు. సోమవారం వారు ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు షామియానా జయన్న, రెడ్డిముని, మురళీమోహన్, సురేశ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ రాష్ట్ర ప్రముఖ్‌గా మహేష్ నియామకం


మహేష్‌ను అభినందిస్తున్న రాష్ట్ర వీహెచ్‌పీ నాయకులు

కలికిరి, ఆగస్టు 5: విశ్వ హిందూ పరిషత్ సామాజిక సమరసత రాష్ట్ర ప్రముఖ్‌గా చింతపర్తి మహేష్‌ను నియమించారు. మండలంలోని గుట్టపాళెం పంచాయతీకి చెందిన మహేష్ రాష్ట్ర ప్రముఖ్‌గా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నందిరెడ్డి సాయి రెడ్డి, కాకర్ల రాముడు తెలిపారు. తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో మూడు రోజులుగా కేంద్రీయ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వీహెచ్‌పీ రాష్ట్ర సమావేశాల సందర్భంగా ఈ నియామకం చేశారు. గత 13 ఏళ్ళుగా చింతపర్తి మహేష్ వీహెచ్‌పీలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. హిందూ సమాజ సంఘటన కోసం క్రియాశీలకంగా పనిచేశారు. వీహెచ్‌పీ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేశారు. కాగా వీహెచ్‌పీలోని అన్ని కార్యక్రమాలను సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రముఖ్‌గా అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా చింతపర్తి మహేష్ చెప్పారు.

షూటింగ్ బాల్‌లో కన్నెమడుగు విద్యార్థుల ప్రతిభ

తంబళ్లపల్లె, ఆగస్టు 5: కన్నెమడుగు ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మదన్‌మోహన్ తెలిపారు. ఆదివారం పీలేరులోని భువన విద్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కన్నెమడుగు హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులు ఆర్.మహేష్, కే.సుబ్రమణ్యం, 9వ తరగతి విద్యార్థులు ఎం.ప్రణీత, సి.సుమిత్ర సత్తా చాటారు. వీరికి స్టాండ్ బై ప్లేయర్‌గా 8వ తరగతి చదువుతున్న జి.రుషిత ఎంపికైందన్నారు. ఈ నలుగురు విద్యార్థులు ఈ నెల 10, 11 తేదీల్లో చిత్తూరు జిల్లా వి.కోటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. ఆయా విద్యార్థులను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం, పీఈటీ ఖాదర్‌బాష, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నాగదేవతల ప్రతిష్ఠకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5: చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న నాగదేవతల ప్రతిష్ట కార్యక్రమానికి సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఇంటి వద్ద కలిసి ఆహ్వానించారు. దీనికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సానుకూలంగా స్పందించి కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ , ఆర్ వి రమణ , మోహన పాల్గొన్నారు .